

వైసీపీ పాలనలో నవరత్నాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోంది. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 31.08.2026

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 131 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# కరువు గడ్డపై కృష్ణమ్మ జలధార!




- ప్రాజెక్టు ఫేజ్-1 ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల కల సాకారం... ప్రజల్లో హర్షాతిరేకం
- 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' పేరుతో వేడుకగా కార్యక్రమం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. దశాబ్దాలుగా తీవ్ర కరువును ఎదుర్కొంటున్న మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి ప్రారంభించి, నీటిని విడుదల చేయనున్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం లభించనుంది. ముఖ్యంగా 30 ఏళ్ల క్రితం, 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు తొలి దశను స్వయంగా మిగతా 2లో...

# విశాఖలో వైద్య మహోదయం!

## నేడు ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్



- వెయ్యి పడకలు.. 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలు
- రూ.2 వేల కోట్ల పెట్టుబడి.. 9 వేల ఉద్యోగాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాప్రభుత్వ పాలనలో విశాఖపట్నం అంతర్జాతీయ నగరంగా రూపుదిద్దుకుంటోంది. విశాఖలో ప్రపంచస్థాయి మౌలిక మౌలిక వసతులు, పారిశ్రామికాభివృద్ధికి ప్రజాప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖకు ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి అందుబాటులోకి రానుంది. విశాఖలోని ఎండాడ ప్రాంతంలో ఏఐజీ హాస్పటల్స్ నిర్మాణానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఆసుపత్రి ఏర్పాటు ద్వారా ఏపీ వాసులు ఇకపై హైదరాబాద్ వెళ్లే పనిలేకుండానే మెరుగైన వైద్యం రాష్ట్రంలోనే అందుబాటులోకి రానుంది.

**రూ.2వేల కోట్ల పెట్టుబడి, 9వేల మందికి ఉద్యోగాల కల్పన :** విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో 2వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. ఓపీడీ సేవలు రోజుకు 5వేలు ఉండనున్నాయి. హైదరాబాద్ లోని ఏషియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీకి చెందిన ఏఐజీ హాస్పిటల్స్.. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటుచేయనుంది. ఒకే క్యాంపస్‌లో వైద్య సేవలు, శిక్షణ, పరిశోధన, రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన కంప్లీట్ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్ ను నెలకొల్పనుంది. మొదటి దశలో టవర్-ఏ, టవర్-బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి పూర్తిచేయనున్నారు. రెండో దశలో టవర్-సి నిర్మాణాన్ని 350 పడకల సామర్థ్యంతో రెండేళ్లలో పూర్తిచేయనున్నారు. ఔట్‌పేషెంట్ విభాగాన్ని రోజుకు సుమారు 5వేల మంది రోగులకు సంప్రదింపులు అందించే విధంగా రూపొందించారు.


**50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలు ఏర్పాటు :** హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్స్‌లో అందించే పూర్తిస్థాయి వైద్య సేవలను ప్రతిబింబించేలా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మిగతా 2లో...



# పింఛన్‌దారులకు.. భరోసా బలం!

- సెప్టెంబరు పింఛన్లకు రూ.2,693.90 కోట్లు విడుదల
- సెప్టెంబరు 1న 61.92 లక్షల మందికి పంపిణీ
- కొత్తగా 6,268 మందికి స్పౌజ్ పెన్షన్లు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ నెలలో 61,92,396 మంది పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,693.90 కోట్లను విడుదల చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి మిగతా 3లో...



# ఆకాశమార్గంలో.. ఆరోగ్య భరోసా!

## సత్ఫలితాలిస్తున్న వైద్య శాఖ వినూత్న యత్నం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రవేశపెట్టిన డ్రోన్ ఆధారిత వైద్య రవాణా వ్యవస్థ సత్ఫలితాలు అందిస్తోంది. కొండలు, దట్టమైన అటవీ ప్రాంతాలు, రహదారి సౌకర్యాల కొరత కారణంగా వైద్య పరీక్షలు, మందుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన గిరిజనుల ఇబ్బందులను ఈ విధానం తగ్గిస్తోంది. జనవరి 2026లో ప్రారంభమైన ఈ సేవల్లో నాలుగు డ్రోన్ల ద్వారా ఇప్పటివరకు 1,800కుపైగా ట్రిప్పులు పూర్తయ్యాయి. డ్రోన్లు 71 వేల కిలోమీటర్లకుపైగా ప్రయాణించాయి. 2,200కుపైగా వైద్య పరీక్షల నమూనాలను తరలించగా, వాటిలో 596 సికిల్‌సెల్ నమూనాలు ఉన్నాయి. 9,000కుపైగా పరీక్షలకు అవకాశం కల్పించడంతోపాటు 24,500 మందికిపైగా రోగులకు సేవలు అందించినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**8 ఆసుపత్రులతో అనుసంధానం :** పాడేరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)తో పాటు లొథుగెడ్డ, తాజంగి, సుంకరమెట్ట, భీమవరం, అనంతగిరి పీహెచ్‌సీలు, ముంచింగిపుట్టు సీహెచ్‌సీ, చింతపల్లి, అరకు ఏరియా ఆసుపత్రులను డ్రోన్ నెట్‌వర్క్‌తో అనుసంధానించారు.

ఆగస్టు 29న గన్నెల పీహెచ్‌సీ నుంచి ఆర్‌కే నగర్ గ్రామానికి వైద్య పరీక్షల నివేదికలు, వ్యాక్సిన్లు, మందులను డ్రోన్ ద్వారా తరలించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారని మంత్రి తెలిపారు. మిగతా 2లో...

- డ్రోన్లతో మారుమూల గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు
- కొండలు, కోనల్లో గిరిజనుల కష్టాలకు చెక్
- జనవరి 2026లో ప్రారంభమైన 4 డ్రోన్లు
- నేటి వరకు 1,800కుపైగా ట్రిప్పులు
- 71 వేల కిలోమీటర్లకుపైగా ప్రయాణం
- 24,500 మందికిపైగా రోగులకు సేవలు.
- సమయం, దూరం, ఖర్చుల ఆదా
- గిరిజనులకు సత్వర వైద్యం
- రాష్ట్రంలో తొలిసారి ప్రవేశపెట్టిన డ్రోన్ ఆధారిత వైద్య రవాణా వ్యవస్థతో సత్ఫలితాలు

## ప్రధాని మోడీకి
# ఉజ్బెకిస్తాన్ అత్యున్నత గౌరవం

**ఉజ్బెకిస్థాన్ :** ప్రధాని నరేంద్ర మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం లభించింది. ఉజ్బెకిస్థాన్ స్వాతంత్ర్యం 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆ దేశ అత్యున్నత గౌరవమైన 'ఓలీ దరాజ్లీ దోస్టిక్' పురస్కారాన్ని మోదీకి అందజేశారు. ఈ సందర్భంగా ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. తనకు లభించిన పురస్కారాన్ని భారతీయులకు అంకితం చేస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు.

**భారత్-ఉజ్బెకిస్థాన్ సంబంధాలపై చర్చలు :** ప్రధాని మోదీ, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ మధ్య ఆదివారం తాష్కెంట్‌లో ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. కుక్సారోయ్ ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావేశంలో భారత్-ఉజ్బెకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలు సమీక్షించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు తదితర కీలక రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు.


భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు ప్రాధాన్యతా అంశాలు, కార్యాచరణ ప్రణాళికపైనా మోదీ, మిర్జియోయెవ్ చర్చలు జరిపారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్, కార్యదర్శి (వెస్ట్) సిబి జార్జ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు.



మిగతా 2లో...

# రాయలసీమలో పల్లె సీమల అభివృద్ధి

- సీమ ప్రజల కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక విజన్
- రూ. 8,022 కోట్లతో గ్రామాలు, అటవీ అభివృద్ధి ప్రణాళికలు
- రూ. 4,523 కోట్లతో 23,000కు పైగా రోడ్ల పనులు
- 5,238 కిలోమీటర్ల మేర బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి
- జల సంరక్షణ చర్యలతో సీమ సస్యశ్యామలం
- ఉపాధి హామీ ద్వారా 62 వేల ఎకరాల్లో ఉద్యాన సాగు... 28 వేల మంది రైతులకు లబ్ధి
- నీటి కుంటలు, ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి
- 50 వేలకు పైగా ఎకరాల్లో పెరిగిన సాగు విస్తీర్ణం
- పాడి రైతుకు అండగా గోకులాలు, నీటి తొట్టెల నిర్మాణం
- సీమ దాహార్తి తీర్చేందుకు సిద్ధమవుతున్న జేజేఎం-అమరజీవి జలధారలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాయల సీమను రతనాల సీమగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార పథకాలతో సీమ గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. గడచిన రెండేళ్లలో సుమారు రూ. 8,022 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టారు. జల సంరక్షణ, రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, రైతులకు అండగా ఉపాధి కల్పన, పాడి రైతులకు గోకులాల భరోసా, పండ్ల తోటల రైతులకు మద్దతుగా ఉద్యాన సాగు, పారిశుధ్యం తదితర అంశాల్లో ఉప ముఖ్యమంత్రివర్యుల మిగతా 2లో...

# నీట్ పీజీ.. ప్రశాంతం



- 2,73,096 మంది నమోదు.. 2,65,980 మంది పరీక్షకు
- జైపూర్‌లో రెండు కేంద్రాల్లో అంతరాయం.. ప్రత్యేక రీ-ఎగ్జామ్

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా వైద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీ-2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షను ఒకే విడతలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో 1,111 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిగతా 2లో...

# కొండల నుంచి.. ఐఐటీల దాకా!

- గిరిజన విద్యార్థుల కోసం మారికవలసలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- 600 మంది విద్యార్థులకు నీట్, ఐఐటీ-జేఈఈ అత్యుత్తమ శిక్షణ
- వారి భవిష్యత్తుపై రాజకీయాలు వద్దు: మంత్రి సంధ్యారాణి



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచడమే లక్ష్యంగా విశాఖపట్నం జిల్లా మారికవలసలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసినట్లు గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు గిరిజన విద్యార్థులకు ఉన్నతమైన విద్య, మెరుగైన అవకాశాలు, బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న 600 మంది ప్రతిభావంతులైన ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన రెసిడెన్షియల్ విద్యతో పాటు వసతి, ఆహారం, నీట్, ఐఐటీ-జేఈఈ కోచింగ్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వీరిలో 300 మంది బాలురు, 300 మంది బాలికలు ఉన్నారని, విద్యార్థులను వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్రముఖ కోచింగ్ సంస్థ ఫిజిక్స్ వాలా, నోయిడాను కోచింగ్ ఏజెన్సీగా నియమించామని, ఇప్పటికే 18 మంది అధ్యాపకులు విధుల్లో చేరగా కోచింగ్ తరగతులు ప్రారంభమయ్యాయని వివరించారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు నేపథ్యంలో మారికవలస రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న 445 మంది విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా వారిని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, మారికవలస, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ సంస్థలకు దశలవారీగా బదిలీ చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 411 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల్లో సంతోషంగా చదువుకుంటున్నారని చెప్పారు. అయితే 34 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కొందరు ప్రతిపక్ష నాయకులు, గిరిజన సంఘాల పేరుతో ప్రభావితం చేస్తూ వారి విద్యకు ఆటంకం కలిగించడం బాధాకరమన్నారు.

**పిల్లల భవిష్యత్తుపై రాజకీయాలు వద్దు :** 411 మంది విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చదువుకుంటున్నప్పుడు కేవలం 34 మంది విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. రాజకీయాలను పిల్లలపై, వారి భవిష్యత్తుపై రుద్దవద్దని విజ్ఞప్తి చేశారు. గిరిజన బిడ్డలకు ఉన్నతమైన చదువులు అవసరం లేదా అని మిగతా 2లో...

# కరువు గడ్డపై కృష్ణమ్మ జలధార!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించడం చారిత్రక ఘట్టంగా నిలవనుంది. 'వెలిగొండ జలసిరులు–అభివృద్ధికి రెక్కలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది.

**కరవు నేలకు కృష్ణమ్మ జలాలు :** తీవ్ర వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ సమస్యలు, సాగునీటి కొరతతో దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతానికి వెలిగొండ కేవలం ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు మాత్రమే కాదు... ఆ ప్రాంత భవిష్యత్తును మార్చే జీవనాధార ప్రాజెక్టు. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించి నల్లమలసాగర్‌లో నిల్వ చేసి, ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 30 మండలాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలతో సహా సుమారు 23 లక్షల మందికి తాగునీటి ప్రయోజనం చేకూరనుంది.

**తొలిదశతో కొత్త అధ్యాయం :** తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నారు. తొలి విడతలో సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెలిగొండ జలాలు అందుబాటులోకి రావడం ద్వారా



వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. సాగునీటి భద్రత పెరగడంతో పంటలపై అనిశ్చితి తగ్గి, పంటల వైవిధ్యీకరణకు అవకాశం ఏర్పడుతుంది. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గడంతో పాటు ఉద్యానవనం, అగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలు అభివృద్ధి చెందేందుకు అవకాశాలు పెరుగుతాయి. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడి, వలసలకు అడ్డుకట్ట పడనుంది.

**30 ఏళ్ల ప్రయాణం... సంకల్పం నుంచి సాకారం వరకు :** 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు ప్రయాణంలో ఎన్నో సాంకేతిక, ఆర్థిక, నిర్మాణపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. సొరంగాల నిర్మాణం, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, భూసేకరణ, పునరావాసం వంటి క్లిష్టమైన అంశాలను అధిగమిస్తూ ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన అనంతరం వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా తీసుకుని పనులను వేగవంతం చేసింది. టన్నెల్ పనులు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో పాటు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టిసారించింది. కేవలం 48 రోజుల వ్యవధిలో నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం చెల్లింపులు జరపడం ద్వారా పనులకు వేగం తీసుకువచ్చింది. అంతేకాకుండా గెజిట్, జాబితాలో పేర్లు లేని వారికోసం మరో రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్ల నిండిని వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబు... ప్రారంభిస్తున్నదీ చంద్రబాబే' అన్న అరుదైన చారిత్రక ఘట్టానికి ఆగస్టు 31వ తేదీ వేదిక కానుంది. 30 ఏళ్ల క్రితం చేసిన సంకల్పం ఇప్పుడు సాకారమవుతుండటం మార్కాపురం ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, ఉదయం 10.15 గంటలకు మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులు ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతారు. ఉదయం 10.25 గంటలకు రోడ్డు మార్గంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదికకు చేరుకుంటారు. ఉదయం 10.35 గంటల నుంచి 11.20 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి... వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్--1ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం ప్రాజెక్టు గేట్లను ప్రారంభించి వెలిగొండకు కృష్ణా జలాల విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 11.30 గంటలకు గంటవానిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సభ అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుగు ప్రయాణమై మధ్యాహ్నం 2.15 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

# విశాఖలో వైద్య మహోదయం!

(మొదటి పేజీ తరువాయి)

50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలు ఉండనున్నాయి. ప్రత్యేక మాతా శిశు విభాగం ఏర్పాటుచేయనున్నారు. ప్రత్యేకంగా కేటాయించిన 2.5 ఎకరాల ప్రాంగణంలో నర్సింగ్ కళాశాల, నర్సింగ్ సిబ్బంది కోసం హాస్టల్ నిర్మించనున్నారు. అనుబంధ ఆరోగ్య సేవలు, సాంకేతిక సిబ్బందికి పారామెడిక్ ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పనున్నారు. నిరంతర విద్యా కార్యకలాపాల కోసం 500 సీట్ల ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, AI సెంటర్ ఏర్పాటుచేయడం జరుగుతుంది. విజిటింగ్ ఫ్యాకల్టీ, డాక్టర్స్ కోసం వసతి, రోగుల సహాయకులు, బంధువుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి కల్పిస్తారు. ఆసుపత్రి పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత వెయ్యి మంది వైద్యులు సేవలందించనున్నారు.

వైద్యరంగంలో ఏఐజీ హాస్పిటల్స్ కు 30 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. హైదరాబాద్‌లో 3 యూనిట్లు, 1,400కు పైగా పడకలు, 350కు పైగా ఐసీయు పడకలు, 600కు పైగా వైద్యులు, హెల్త్ కేర్ నిపుణులు ఉన్నారు. ఇప్పటివరకు 10 లక్షలకు పైగా రోగులకు చికిత్స అందించారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టైనల్ ఎండోస్కోపీ యూనిట్‌కు ఏఐజీ హాస్పిటల్స్ నిలయంగా ఉంది.

# నీట్ పీజీ.. ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 2,73,096 మంది వైద్యులు పరీక్షకు నమోదు చేసుకోగా.. 2,65,980 మంది హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటలకు ముగిసింది.

**జైపూర్‌లో అంతరాయం :** రాజస్థాన్‌లోని జైపూర్‌లో రెండు పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, సాంకేతిక సమస్యల కారణంగా పరీక్షకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరీక్షను పూర్తిచేయలేకపోయిన 2,445 మంది అభ్యర్థులకు సెప్టెంబరు 5న ప్రత్యేకంగా రీ–ఎగ్జామ్ నిర్వహించాలని ఎన్‌బీఈఎంఎస్ నిర్ణయించింది.

**పటిష్ఠ నిఘా :** పరీక్షలో అక్రమాలకు, మోసాలకు తావులేకుండా ఎన్‌బీఈఎంఎస్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. లైవ్ సీసీటీవీ పర్యవేక్షణ, ప్రత్యేక కమాండ్ సెంటర్లు, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా పరీక్ష ప్రక్రియను పర్యవేక్షించారు. పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

**సెప్టెంబరు 30లోగా ఫలితాలు? :** నీట్ పీజీ–2026 ఫలితాలను సెప్టెంబరు 30లోగా విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## కొండల నుంచి.. ఐఐటీల దాకా!

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించిన ఆమె, తనను విమర్శించడమే లక్ష్యమైతే గిరిజన సమాజం కోసం ఎన్ని విమర్శలనైనా భరిస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని విమర్శించాలనే ఉద్దేశంతో గిరిజన విద్యార్థుల విద్యను అడ్డుకోవడం ఏమాత్రం సమంజసం కాదన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫర్నిచర్, సమాచార, సాంకేతిక సదుపాయాలు, మానవ వనరుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు. గిరిజన విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధం చేయడం ద్వారా ఐఐటీలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్, వైద్య కళాశాలలు తదితర ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలకు అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

గిరిజన బిడ్డలకు అత్యుత్తమ విద్యను అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు.

## గ్రూప్ -1 పరీక్షలకు హాజరయ్యే... మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

- ఎంపిక కోసం రాష్ట్రస్థాయిలో ప్రవేశ పరీక్ష
- రేపటినుండి సెప్టెంబరు 10 వరకు దరఖాస్తుకు అవకాశం
- మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాబ్ క్యాలెండర్–2026కు పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రవేశ పరీక్షను నిర్వహించబోతున్నట్లు శనివారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్షలకు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం)– ఏపీ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబోతునట్లు ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మైనారిటీ సమాజానికి చెందిన నిరుద్యోగ యువత ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడి, సమాజంలో సమున్నత స్థానాన్ని అందుకోవాలన్నదే సీఎం చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.

**అభ్యర్థుల ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష :** మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఆన్ లైన్ తో పాటు ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని మైనారిటీ మంత్రి ఫరూక్ తెలిపారు. అత్యంత పారదర్శకమైన పద్ధతిలో ఉచిత శిక్షణా తరగతులకు అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో వివిధ కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబోతున్నట్టు మంత్రి తెలిపారు. ఈ ప్రవేశపరీక్ష లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల కు మాత్రమే ఉచిత శిక్షణ పొందే అర్హత లభిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగినరాష్ట్ర వ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను "సిఈడిఎం–ఏపీ" అధికారిక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆఫ్ లైన్ శిక్షణా తరగతులకు దరఖాస్తు చేసుకునే వారు డిగ్రీలో కనీసం 60% మార్కులు పొంది, తెల్ల రేషన్ కార్డ్ కలిగిన కుటుంబాలకు చెందిన వారై ఉండాలన్నారు. ఆన్ లైన్ శిక్షణ కోరుకునే మైనారిటీ అభ్యర్థులకు మాత్రం పై నిబంధన వర్తించదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్: ఌఌ.ఖజూఎవసఎఎఌ. శీతీస్త్ర లేదా 08645-297535, 7386789966 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ప్రవేశ పరీక్షకు ఆన్ లైన్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 31వ తేది నుండి ప్రారంభమై సెప్టెంబరు 10 వ తేదితో ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థుల కనీస అర్హతలు, ప్రవేశ పరీక్షకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఇతర ముఖ్య వివరాలు సిఈడిఎం–ఏపీ అధికారిక వెబ్ సైట్ లో పొందుపరచడం కూడా జరిగిందని తెలిపారు.

**గ్రూప్-2 పరీక్షల ఉచిత శిక్షణ కోసం ప్రత్యేక ప్రకటన :** కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మక జాబ్ క్యాలెండర్ -2026 లో భాగంగా త్వరలో విడుదలయ్యే గ్రూప్ -2 ఉద్యోగ నోటిఫికేషన్ ను దృష్టిలో వుంచుకొని గ్రూప్ -2 ఉద్యోగార్థులకు కూడా ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు. ఇందుకోసం మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేకంగా ప్రకటన జారీ చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిపుణులైన అధ్యాపకులతో అందిస్తున్న ఉచిత శిక్షణను మైనారిటీ యువత సువర్ణ అవకాశంగా భావించి, పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆకాంక్షించారు.

# ఆకాశమార్గంలో.. ఆరోగ్య భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా అధికారులతో జరిగిన రివ్యూ సందర్భంగా ఆదివారం మంత్రి శ్రీ సత్యకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు ఈ సేవలను విస్తృతం చేయబోతున్నట్లు చెప్పారు.

**వ్యాక్సిన్లు, మందులు కూడా తరలింపు :** వైద్య పరీక్షల నమూనాలతో పాటు అత్యవసర మందులు, వ్యాక్సిన్లు, ఇతర వైద్య సామగ్రిని అవసరమైన ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా వేగంగా తరలిస్తున్నారు. దీంతో రోగులు పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతోంది. ప్రయాణ సమయం, ఖర్చులు, పనిదినాల నష్టాన్ని కూడా ఈ విధానం గణనీయంగా తగ్గిస్తోందని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు

**సికిల్‌సెల్ స్క్రీనింగ్‌కు ఊతం :** వైద్య పరీక్షల నమూనాలు త్వరగా ప్రయోగశాలలకు చేరడంతో ఫలితాలు కూడా సకాలంలో అందుతున్నాయి. దీంతో చికిత్సలో జాప్యాన్ని నివారించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా సికిల్‌సెల్ వ్యాధి




స్క్రీనింగ్‌తోపాటు వ్యాధి నిఘా, ప్రజారోగ్య కార్యక్రమాలకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతోందని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా పీహెచ్‌సీలకు అవసరమైన మందులు, వైద్య సామగ్రిని సకాలంలో చేరవేయడం ద్వారా ప్రభుత్వ వైద్య మౌలిక వసతులను మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతోంది.

**గిరిజన యువతకు శిక్షణ : మంత్రి సత్యకుమార్ :** డ్రోన్ కార్యకలాపాలు, సహాయక సేవల్లో స్థానికుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఇప్పటివరకు 25 మందికిపైగా స్థానిక, గిరిజన యువతకు శిక్షణ ఇప్పించాం.

మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాశీ. వైద్య పరీక్షల నమూనాలు, మందులు, అవసరమైన సామగ్రిని వేగంగా తరలించడం ద్వారా రోగులకు సకాలంలో పరీక్షలు, చికిత్స అందించేందుకు వీలవుతోందన్నారు.

## ప్రధాని మోడీకి ఉజ్బెకిస్తాన్ అత్యున్నత గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

**మోదీకి ఘన స్వాగతం :** అంతకుముందు తాష్కెంట్‌లో ప్రధాని మోదీకి అధ్యక్షుడు మిర్జియోయెవ్ ఘన స్వాగతం పలికారు. శనివారం ఉజ్బెకిస్థాన్ చేరుకున్న మోదీకి మిర్జియోయెవ్ విమానాశ్రయంలో స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి కారులో అధ్యక్ష భవనానికి వెళ్లారు. ఆ తర్వాత విందు సమావేశంలోనూ పాల్గొన్నారు.

ఉజ్బెకిస్థాన్‌కు మోదీ పర్యటించడం ఇది నాలుగోసారి. ప్రధాని పర్యటన సందర్భంగా తాష్కెంట్‌లోని హిల్టన్ హోటల్ సహా పలు ప్రముఖ భవనాలను భారత త్రివర్ణ పతాకంలోని రంగులతో అలంకరించారు. భారత ప్రవాసులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భారత, ఉజ్బెక్ సంప్రదాయాలను మేళవించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**యోగా కార్యక్రమంలో పాల్గొన్న మోదీ :** పర్యటనలో భాగంగా ఉజ్బెకిస్థాన్ యోగా ఫెడరేషన్ నిర్వహించిన యోగా కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ సమాజంతో సమావేశమైన దృశ్యాలు, యాంగీ ఉజ్బెకిస్థాన్ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించిన చిత్రాలను 'ఎక్స్'లో పంచుకున్నారు.

భారత ప్రవాసులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాన్ని మోదీ ప్రశంసించారు. 'ఉడే జబ్ జబ్ జుల్ఫేన్ తేరీ' పాటకు బాలీవుడ్ బ్యాటిల్ గ్రూప్ ప్రదర్శన, కథక్–అందిజన్ పోల్కా ఫ్యూజన్, లాల్ బహదూర్ శాస్త్రి సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్ విద్యార్థుల కథక్ ప్రదర్శనలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

# రాయలసీమలో పల్లె సీమల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

దార్శనికతతో విశేష ఫలితాలు సాధించారు.

రాయలసీమ వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకుని పవన్ కళ్యాణ్ తన శాఖల పరిధిలో కేటాయింపులు, పనుల అమలులో ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించిన వెంటనే చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమం 13,326 పంచాయతీల్లో ఏకకాలంలో గ్రామసభల నిర్వహణ. ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు నియోజకవర్గం మైసూరువారిపల్లి గ్రామాన్ని వేదికగా చేసుకున్నారు. ఫారం పాండ్స్ (పంట కుంటలు) రాష్ట్రవ్యాప్త నిర్మాణ కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పుడిచర్ల గ్రామంలో శ్రీకారం చుట్టారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వీబీజీ–రాంజీ జాతీయ స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా రాయలసీమ ప్రాంతాన్నే వేదికగా ఎంచుకుని ఆ ప్రాంతం పట్ల తన దృక్పథాన్ని చాటుకున్నారు.

అభివృద్ధి పనుల విషయానికి వస్తే, ఒక్క ఫారం పాండ్ల నిర్మాణం ద్వారానే రాయలసీమ వ్యాప్తంగా అదనంగా 50 వేలకు పైగా ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. రైతులకు సుమారు రూ. 55 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. రాయలసీమలో జలసిరులు పారిస్తూ పవన్ కళ్యాణ్ పంటల సాగుకు అనుకూల పరిస్థితులను కల్పించారు. ఎనిమిది జిల్లాల పరిధిలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (ఐఔపీూ) ఆధ్వర్యంలో గ్రామీణ మౌలిక సదుపాయాలు, నీటి సంరక్షణ, జీవనోపాధిని మెరుగుపరచే కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార కింద మూడు మెగా వాటర్ స్కీమ్ పథకాలను ముందుకు తీసుకువెళ్తున్నారు.

బీటలు వారిన నేలలతో ఉన్న రాయలసీమకు కొత్త జీవం పోస్తూ వేల సంఖ్యలో ఫారం పాండ్లు నిర్మించి, వేలాది ఎకరాల భూమిని సాగుకు అనుకూలంగా మార్చారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఓర్వకల్లు మండలం పుడిచర్ల గ్రామంలో ఫారం పాండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదటి దశలో రాయలసీమ ఎనిమిది జిల్లాల పరిధిలో రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో 40,837 పంట కుంటలు నిర్మించాలన్న లక్ష్యాన్ని అధిగమించారు. రూ. 166.46 కోట్లు వెచ్చించి 41,614 వ్యవసాయ చెరువులు నిర్మించి లక్ష్యాన్ని మించి సాధించారు. రెండో దశలో ఇప్పటికే 29,902 ఫార్మ్ పాండ్లు మంజూరై వివిధ దశల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. రెండు దశల ఫారం పాండ్ల నిర్మాణంతో రాయలసీమ ప్రాంతంలో అదనంగా 50 వేలకు పైగా ఎకరాల భూమి సాగులోకి వచ్చింది.

**15,000 మినీ గోకులాల నిర్మాణం :** రాయలసీమ వ్యాప్తంగా ఉన్న పాడి రైతులకు అండగా గడచిన రెండేళ్లలో సుమారు 15 వేల మినీ గోకులాలు (వ్యక్తిగత పశువుల షెడ్లు)



నిర్మించారు. మరో 3 వేల గోకులాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. అందులో మొదటి దశలోనే లక్ష్యాన్ని అధిగమించి 9,708 మినీ గోకులాలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పల్లెపండుగ, పల్లెపండుగ 2.0 కార్యక్రమాల్లో కలిపి కేవలం వ్యక్తిగత పశువుల షెడ్ల నిర్మాణానికే రూ. 170 కోట్లకు పైగా వ్యయం చేశారు.

**హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ.. ఉపాధి హామీ పథకం భాగస్వామ్యం :** రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రైతులకు అండగా పండ్ల తోటలు, పూలు, మునగ వంటి ఉద్యాన పంటల సాగుకు సహకారం అందించారు. రెండు దశల్లో సుమారు 62 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటల సాగుకు రూ. 200 కోట్లకు పైగా ఖర్చు చేశారు. నిరుపేద రైతులకు అండగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఎకరాకు ఏటా రూ. 80 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం లభిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా రాయలసీమ ప్రాంతంలో 28 వేల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరింది.

**ముసలమడుగులో కుంకీల స్థావరం :** అటవీశాఖ ద్వారా రాయలసీమ ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకువెళ్తున్నారు. ముఖ్యంగా చిత్తూరు, అన్నమయ్య తదితర రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో అడవి ఏనుగుల సమస్య నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు కర్ణాటక నుంచి తీసుకొచ్చిన కుంకీ ఏనుగులకు పలమనేరు నియోజకవర్గం పరిధిలోని ముసలమడుగులో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముసలమడుగు శిబిరం నుంచే కుంకీలు దాదాపు 15 ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేశాయి. కుంకీల రాకతో మానవ–ఏనుగుల ఘర్షణలు 75 శాతం తగ్గాయి. పంటల నష్టం కూడా 50 శాతం తగ్గింది.

పట్టణాలకు పచ్చని ఊపిరితిత్తులుగా పేరుగాంచిన నగర వనాలను రాయలసీమ ప్రాంతంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే రూ. 26 కోట్లతో 13 నగర వనాల నిర్మాణం పూర్తి చేశారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, పుట్టపర్తి సత్యసాయి ఎకో పార్క్, బద్వేల్, తిరుపతి కైలాసగిరి, అన్నమయ్య జిల్లాలో కోడూరు, నంద్యాల జిల్లా పరిధిలో డోన్ తదితర ప్రాంతాల్లో నగర వనాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

**పురోగతిలో రూ. 2,782 కోట్ల జేజేఎం-అమరజీవి జలధార పనులు :** నిత్యం దాహార్తితో అల్లాడే రాయలసీమ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి జేజేఎం–అమరజీవి జలధార పథకాల పనులను ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకువెళ్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న పులివెందుల మల్టీ విలేజ్ వాటర్ స్కీమ్ పనులను రూ. 280 కోట్లు వెచ్చించి పూర్తి చేస్తున్నారు. రూ. 480 కోట్లతో ప్రారంభమైన ఈ వాటర్ స్కీమ్ గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైంది. 2024 నాటికి జల్ జీవన్ మిషన్ గడువు ముగియడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

పవన్ కళ్యాణ్ కూటమి పెద్దలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి జల్ జీవన్ మిషన్ గడువును మరో నాలుగేళ్లపాటు పొడిగించడంతో పులివెందుల తాగునీటి పథకం పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ పథకానికి సంబంధించి పూర్తయిన 96 శాతం పనుల్లో 56 శాతం పనులు పవన్ కళ్యాణ్ చొరవతోనే పూర్తయ్యాయి. ఇప్పటికే పులివెందుల గ్రామీణ, సింహాద్రిపురం మండలాల పరిధిలో ప్రజలకు తాగునీరు అందుతోంది.

డోన్ మల్టీ విలేజ్ స్కీమ్‌ను కూడా గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలి వెళ్లగా, ఉప ముఖ్యమంత్రివర్యులు రూ. 132 కోట్లతో పనులు చేపట్టారు. ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఈ పథకం ద్వారా మూడున్నర లక్షల మందికి తాగునీరు అందనుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రూ. 2,370 కోట్లతో చిత్తూరు మెగా వాటర్ గ్రిడ్ పథకానికి శ్రీకారం చుట్టారు. వచ్చే 30 ఏళ్లలో దాదాపు 25 లక్షల మందికి పైగా ప్రజల దాహార్తి తీర్చే ఈ పథకం పనులు వేగంగా సాగుతున్నాయి.

**రోడ్ల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ :** రాయలసీమ వ్యాప్తంగా ఎనిమిది జిల్లాల పరిధిలో గ్రామాల్లో అంతర్గత రహదారులు, గ్రామాల అనుసంధాన రహదారుల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టారు. పల్లెపండుగ, పల్లెపండుగ 2.0, సాస్కీ తదితర పథకాల ద్వారా రూ. 4,523 కోట్ల అంచనా వ్యయంతో 23,000కు పైగా రోడ్ల పనులు చేపట్టారు. అందులో 4,630 కిలోమీటర్ల బీటీ, 3,067 కిలోమీటర్ల సీసీ రోడ్లు ఉన్నాయి. మంజూరైన వాటిలో 2,582 కిలోమీటర్ల బీటీ, 2,655 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మాణం కూడా పూర్తయ్యాయి. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. అందులో అత్యధికంగా వైఎస్ఆర్ కడప జిల్లాకు రూ. 876 కోట్లు మంజూరు కాగా, అనంతపురం జిల్లాకు రూ. 691 కోట్లు, తిరుపతి జిల్లాకు రూ. 521 కోట్లు, అన్నమయ్య జిల్లాలకు రూ. 518 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు రూ. 483 కోట్లు కేటాయించారు. ఇందులో పల్లెపండుగ ద్వారా నిర్మించిన రోడ్లు ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పల్లెపండుగ 2.0, సాస్కీ తదితర పథకాల ద్వారా చేపట్టిన రోడ్లలో సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆ జిల్లాలో రోడ్ల నిర్మాణానికి రూ. 30 కోట్లు అదనపు నిధులు మంజూరు చేశారు. పుట్టపర్తికి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు వీలుగా ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

రాయలసీమ ప్రాంత గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చేస్తూ పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణంతో పాటు గ్రామీణ పారిశుధ్య నిర్వహణకు కూడా పవన్ కళ్యాణ్ పెద్దపీట వేశారు. పలు గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. 50 వేలకు పైగా వ్యక్తిగత కంపోస్ట్ గుంతలు, భూగర్భ జలాలను రీచార్జ్ చేసే ఇంకుడు గుంతలు మరో 28 వేలకు పైగా నిర్మించారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తూ, పథకాల అమలులో రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. వీబీజీ–రాంజీ పథకం ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తూ రాయలసీమ అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. వీటికి అదనంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎకో టూరిజం కేంద్రాలు, హస్త కళాకారుల కోసం వుడ్ బ్యాంకుల ఏర్పాటు తదితర కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నారు. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిరంతర సహకారంతో, గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి కట్టుబడి ముందుకు వెళ్తుంది.

## "పింఛన్‌దారులకు.. భరోసా బలం!"

(మొదటి పేజీ తరువాయి)

కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పింఛన్లను పంపిణీ చేస్తామని, కొత్తగా మంజూరైన 6,268 వితంతు లబ్ధిదారులకు సెప్టెంబర్ 1న పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ. 2.51 కోట్లను విడుదల చేసినట్టు కూడా మంత్రి తెలిపారు. భర్త మరణించిన అనంతరం అర్హత కలిగిన జీవిత భాగస్వామి కి సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో స్పౌజ్ పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు పింఛన్ల కోసం ఈ నెల విడుదల చేసిన నిధులతో కలుపుకుని రూ. 73,506 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ నిధులను ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని ... అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

## ఒక్క నిర్ణయం.. 1,643 ప్రాణాలు!

- **విపత్తు వేళ .. 1,643 మంది విద్యార్థుల ప్రాణాలు కాపాడిన ప్రిన్సిపాల్ !**
- **నేపాల్‌లో ఆకస్మిక వరద.. క్షణాల్లో అప్రమత్తమైన రాజేంద్ర దవాది**



**నేపాల్ :** నేపాల్‌లో ఆకస్మికంగా విరుచుకుపడిన వరదల నుంచి ఏకంగా 1,643 మంది విద్యార్థుల ప్రాణాలను ఓ స్కూల్ ప్రిన్సిపాల్ తన సమయస్ఫూర్తితో కాపాడారు. ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి, క్షణాల్లో నిర్ణయం తీసుకుని పిల్లలందరినీ సురక్షిత ప్రాంతానికి తరలించడంతో పెను విషాదం తప్పింది. లేదంటే స్కూల్ భవనంతో పాటు విద్యార్థులు, సిబ్బంది కూడా వరద ప్రవాహంలో కొట్టుకుపోయేవారు.

నేపాల్‌లో గత బుధవారం సంభవించిన ఆకస్మిక వరదలు తీవ్ర బీభత్సం సృష్టించాయి. అనేక గ్రామాలు వరదల్లో కొట్టుకుపోగా, వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. రెండు వేల మందికిపైగా గల్లంతైనట్లు సమాచారం. ఈ విపత్కర పరిస్థితుల్లో త్రిశూలి సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్ర దవాది చూపిన చొరవ ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. నేపాల్‌లోని త్రిశూలి వ్యాలీలో ఉన్న ఈ పాఠశాలలో 1,643 మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడంతస్తుల భవనంలో నిర్వహిస్తున్న స్కూల్‌కు రాజేంద్ర దవాది ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండటంతో పాటు ఇంగ్లీష్ టీచర్‌గానూ వ్యవహరిస్తున్నారు. వరదలు సంభవించిన బుధవారం ఉదయం ఆయన పాఠశాలలోనే ఉన్నారు.

**కొన్ని నిమిషాల్లోనే కీలక నిర్ణయం :** ఉదయం 9.20 గంటల సమయంలో రాజేంద్రకు ఓ స్నేహితుడి నుంచి వరద ముప్పుపై హెచ్చరిక ఫోన్ వచ్చింది. అయితే స్కూల్ ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో పాటు భవనం కూడా పటిష్టంగా ఉండటంతో తొలుత పెద్దగా ప్రమాదం ఉండకపోవచ్చని ఆయన భావించారు. అయితే కొద్దిసేపటికే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పాఠశాలకు వచ్చి పరిస్థితి తీవ్రంగా ఉందని హెచ్చరించాడు. చుట్టుపక్కల ప్రాంతాలను వరద నీరు చుట్టుముడుతోందని, నీటి ప్రవాహం వేగంగా పెరుగుతోందని చెప్పాడు. దీంతో రాజేంద్ర వెంటనే అప్రమత్తమయ్యారు. ఆలస్యం చేయకుండా స్కూల్ అలారం మోగించి, విద్యార్థులందరినీ తరగతి గదుల నుంచి బయటకు తీసుకురావాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అదే సమయంలో స్కూల్ బస్సు డ్రైవర్లను కూడా పిలిపించి, బస్సులను సిద్ధం చేయాలని సూచించారు.

**బస్సులు రాలేకపోవడంతో కొండపైకి .. :** అయితే అప్పటికే వరద ఉధృతి పెరగడంతో బస్సులు స్కూల్ వద్దకు చేరుకోలేకపోయాయి. పరిస్థితిని అర్థం చేసుకున్న రాజేంద్ర మరో క్షణం కూడా ఆలస్యం చేయలేదు. విద్యార్థులందరినీ సమీపంలోని కొండపైకి వెళ్లాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కొండపైకి చేరుకుని అక్కడి బోధి చెట్టు కింద ఆశ్రయం పొందారు. వారు సురక్షిత ప్రాంతానికి చేరుకున్న కొద్దిసేపటికే స్కూల్ భవనం వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది.

**ఇద్దరు సిబ్బంది మృతి .... :** ఈ ఘటనలో ఇద్దరు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. స్కూల్ సోషల్ హిస్టరీ టీచర్ సంతోస్ పరియార్ (32)తో పాటు మరో సిబ్బంది సుల్తాన్ లామా వరదల్లో చిక్కుకుని మృతి చెందారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర దవాది సకాలంలో స్పందించి విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించకపోయి ఉంటే పరిస్థితి మరింత విషాదకరంగా మారేదని స్థానికులు చెబుతున్నారు. ఒక్క నిర్ణయం.. కొన్ని నిమిషాల సమయస్ఫూర్తి.. 1,643 మంది విద్యార్థుల ప్రాణాలను కాపాడింది. ఈ ధైర్యసాహసానికి రాజేంద్ర దవాదిని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసిస్తున్నారు.



# విదేశాల్లో ఎంత ఎదిగినా 'తెలుగు మూలాలు' మరవద్దు

- **మాతృభూమి అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలి**
- **ఆసియా పసిఫిక్ తెలుగు ఫెడరేషన్ సదస్సులో మంత్రి కొండపల్లి**




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విదేశాల్లో స్థిరపడి ప్రపంచ స్థాయిలో ఎంత ఎదిగినా, ప్రవాస తెలుగువారు తమ మూలాలను, తెలుగు భాషా సంస్కృతులను మరువవద్దని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. ఆదివారం ఆయన మలేషియాలోని పెనాంగ్‌లో నిర్వహించిన 'ఆసియా పసిఫిక్ తెలుగు ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) కాన్ఫరెన్స్ – 2026' ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, మలేషియా, సింగపూర్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా వంటి అనేక దేశాల్లో ఉన్న తెలుగు సంఘాలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు ఏపీటీఎఫ్ ఏర్పాటు కావడం ఒక చారిత్రాత్మక ఘట్టమని కొనియాడారు. మన పిల్లలు 'గ్లోబల్ సిటిజన్లు'గా ఎదుగుతూనే తెలుగు జాతిగా ఒక్కటిగా ఉండాలన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర--2047' లక్ష్య సాధనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. మాతృభూమితో ఉన్న భావోద్వేగ అనుబంధాన్ని ఇకపై "అభివృద్ధి భాగస్వామ్యం" గా మార్చుకోవాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ప్రవాసంలో ఉన్న ప్రతి తెలుగు ఇల్లు ఒక చిన్న తెలుగు బడి కావాలని.. యువత కోసం గ్లోబల్ లెవెల్లో మెంటార్‌షిప్, స్టార్టప్ నెట్‌వర్క్‌లను అందుబాటులోకి తేవాలని ఆసియా పసిఫిక్ తెలుగు ఫెడరేషన్ సదస్సులో మంత్రి ప్రసంగించారు.

ప్రపంచ స్థాయి అనుభవం ఉన్న తెలుగు పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టి, ఇక్కడి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని.. విదేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి, వారి నైపుణ్యాలను రాష్ట్ర అభివృద్ధితో అనుసంధానించేందుకు ఏపీఎన్ఆర్‌టీఎస్ ఒక బలమైన వారధిగా పనిచేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే యువ మలేషియా తెలుగు కళాకారులు ప్రదర్శించిన ఉత్తరాంధ్ర శైలి కోలాట భజన తనను ఎంతగానో ఆకట్టుకుందని మంత్రి పేర్కొన్నారు. తరాలు మారినా, దశాబ్దాల కిందట విదేశాలకు వలస వెళ్లినా మలేషియాలోని మన ప్రవాస తెలుగు సమాజం మన సాంస్కృతిక వారసత్వాన్ని గుండెల్లో పదిలంగా కాపాడుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. మలేషియా తెలుగు అకాడమీ ద్వారా కూచిపూడి, జానపద కళలను అభ్యసిస్తూ.. మన తెలుగు యువత అత్యంత ఉత్సాహంతో ఈ సాంప్రదాయ కోలాట నృత్యాన్ని ప్రదర్శించడం ఎంతో స్ఫూర్తిదాయకం అని మంత్రి కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ తాత్కాలిక అధ్యక్షుడు డాక్టర్ ఎస్. వెంకట ప్రతాప్, నిర్వహణ కమిటీ ఛైర్మన్ సత్య సుధాకరన్, తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శివ సూరియ నారాయణ, టాలీవుడ్ నటుడు, రచయిత తనికెళ్ల భరణి మరియు వివిధ దేశాల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# వైద్య విద్య ఫీజుల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి




**కడప,(జర్నలిస్ట్ ఫైల్):** పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెంచిన వైద్య విద్య ఫీజులను తక్షణమే ఉపసంహరించుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు కడపలోని ఆర్ఎస్‌యూ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండం నాటి ప్రశాంత్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు.

ఎంబీబీఎస్ కోర్సులో ఏ–కేటగిరీ ఫీజును రూ. 18,150కు, బీ–కేటగిరీ (మేనేజ్‌మెంట్ కోటా) ఫీజును రూ. 14.52 లక్షలకు, సీ–కేటగిరీ (ఎన్ఆర్ఐ కోటా) ఫీజును రూ. 43.56 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఆందోళనకరమని ప్రశాంత్ అన్నారు. బీడీఎస్ కోర్సు ఫీజులను కూడా దాదాపు ఇదే స్థాయిలో పెంచడంతో వైద్య విద్య మరింత ఖరీదైనదిగా మారుతుందని పేర్కొన్నారు.

ఇప్పటికే వైద్య విద్య కోసం విద్యార్థుల తల్లిదండ్రులు భారీ మొత్తాలను వెచ్చించాల్సి వస్తున్న నేపథ్యంలో ఫీజుల పెంపు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. పేద విద్యార్థులు కష్టపడి చదివి నీట్‌లో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ, అధిక ఫీజులు చెల్లించలేక వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. వైద్య విద్యను సామాన్యులకు అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం ఫీజులను పెంచడం సరికాదని విమర్శించారు.

గతంలో పీపీపీ (పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్) ముసుగులో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరిగాయని, ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత, వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరాటాల నేపథ్యంలో ఆ ప్రయత్నాలకు అడ్డుకట్ట పడిందని ప్రశాంత్ పేర్కొన్నారు. ప్రస్తుతం భారీగా ఫీజులు పెంచడం ద్వారా వైద్య విద్యను సామాన్యులకు మరింత దూరం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. వైద్య విద్య కేవలం వ్యాపారం కాదని, ప్రజారోగ్యానికి సంబంధించిన సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం ఫీజుల పెంపు నిర్ణయాన్ని తక్షణమే పునఃపరిశీలించి, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయడంతో పాటు, వైద్య విద్యకు అవసరమైన స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్ఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు జస్వంత్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# దొంగ ట్రాన్స్‌ఫార్మర్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి

- **సీపీఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్**




**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ) :** బ్రహ్మంగారిమఠం మండలంలో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో మండల విద్యుత్ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ ఆరోపించారు. విద్యుత్ వైర్లు తెగిపడి, వేలాడుతూ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నా అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు.

మండలంలోని పలు గ్రామాలు, కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్లు స్థానికులు చెబుతున్నప్పటికీ, వాటిపై విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

విద్యుత్ శాఖకు చెందిన కొంతమంది సిబ్బంది అక్రమంగా లేదా అనుమతులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజాధనం నష్టపోవడంతో పాటు విద్యుత్ వ్యవస్థ కూడా దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఇప్పటికే విద్యుత్ వైర్లు తగిలి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు పాడైన స్తంభాలు బహిరంగంగా ఉన్న విద్యుత్ పరికరాలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. జగనన్న కాలనీలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ వైర్లపై ప్రత్యేక విచారణ చేపట్టాలని అవి ఎప్పుడు, ఎలా చోరీకి గురయ్యాయి, వాటి విషయంలో సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలపై పూర్తి వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందిలో ఎవరైనా ప్రభుత్వ ఆస్తుల చోరీకి పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల ప్రాణాలు, ప్రభుత్వ ఆస్తుల రక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే విధంగా విద్యుత్ శాఖ వ్యవహరించడం ఏమాత్రం సహించేది లేదని, అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని పెద్దుల్లపల్లి ప్రభాకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి గుడిమే సురేష్ జగదీష్ లు పాల్గొన్నారు.

## విద్యార్థులు సన్మార్గంలో నడవాలి... ఉజ్వల భవిష్యత్ కు బాటలు వేసుకోవాలి

- **విద్యార్థుల లో నైతిక విలువలపై మానసిక మరియు ఆరోగ్య కౌన్సిలర్ షేక్ ప్యారీ జాను సూచనలు**
- **విద్యార్థి దశలో కుటుంబ సభ్యుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి**



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కొన్ని వార్తలు చదివి మర్చిపోవచ్చు, కొన్ని ఘటనలు కేవలం క్రైమ్ స్టోరీలుగా మిగిలిపోవచ్చు కానీ ?నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో జరిగిన నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య ఉదంతం సమాజ అంతరాత్మను తీవ్రంగా ప్రశ్నిస్తోందని విద్యార్థుల మానసిక మరియు ఆరోగ్య కౌన్సిలర్ షేక్ ప్యారీ జాను ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "పుస్తకాలు పట్టాల్సిన చేతుల్లో కత్తులు ఎందుకొచ్చాయి?" అనే ఈ ప్రశ్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తోందని తెలిపారు.

?విద్యార్థి దశ డాక్టర్, ఇంజనీర్, సైనికుడు కావాలని కలలు కనే వయసని, కానీ దురదృష్టవశాత్తు కొందరు మైనర్లు డబ్బు కోసం, జల్సాల కోసం ఇంతటి ఘాతుకానికి పాల్పడటం అత్యంత విషాదకరమని అన్నారు. ఒకప్పుడు కుటుంబం మంచి–చెడులను నేర్పే బడిలా ఉండేదని, నేడు పిల్లలకు ఖరీదైన వస్తువులు ఇస్తున్నా వారి మనసులో ఏముందో తెలుసుకునే సమయం కేటాయించలేకపోతున్నామని అభిప్రాయపడ్డారు.

తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కేవలం మార్కులపైనే కాకుండా, పిల్లల ప్రవర్తనలో వస్తున్న ఆకస్మిక మార్పులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా వాడకం మరియు చెడు సావాసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ాఠశాలలు కేవలం సిలబస్‌కే పరిమితం కాకుండా, విద్యార్థులకు నిరంతరం మానసిక కౌన్సిలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు .విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి, సత్ప్రవర్తన కలిగిన మిత్రులతోనే స్నేహం చేయాలన్నారు .వ్యసనాలకు దూరంగా ఉంటూ, శారీరక దారుఢ్యం కోసం యోగా, ఆటపాటలకు సమయం కేటాయించాలన్నారు . చిన్న సమస్య వచ్చినా ఒంటరిగా నిర్ణయాలు తీసుకోకుండా తల్లిదండ్రులతో లేదా ఉపాధ్యాయులతో పంచుకోవాలని తెలిపారు. ఘటనను కేవలం ఒక వార్తగా కాకుండా, మన పిల్లల పెంపకంపై ఆత్మపరిశీలన చేసుకునే హెచ్చరికగా భావించి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని కోరారు.

# వెలిగొండతో మారనున్న మార్కాపురం రూపురేఖలు

- **చరిత్ర సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా చంద్రబాబుకే సాధ్యం**
- **ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో చరిత్ర సృష్టించాలన్నా.. గత చరిత్రను తిరగరాయాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే సాధ్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వెనుకబడిన మార్కాపురం ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు హార్టికల్చర్ హబ్‌లో చేర్చడం, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించే స్థాయికి తీసుకురావడం చంద్రబాబు నాయుడు నాయకత్వం లోనే సాధ్యమైందని పేర్కొన్నారు.

మార్కాపురం జిల్లా ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కానుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరగనుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు ఇది ఒక చారిత్రక ఘట్టమని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

**ప్రతిపక్షంలో ఉండగానే నికర జలాల కోసం పోరాటం :** వెలిగొండ ప్రాజెక్టుకు నికర జలాలు సాధించేందుకు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఢిల్లీ వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రాంతీయ ప్రజల ప్రయోజనాల కోసం అప్పట్లో చేసిన పోరాటం ఫలించిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్వహణను సైతం పట్టించుకోలేదని విమర్శించారు. జగన్ రెడ్డి ప్రభుత్వ కాలంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించిన వైసీపీ నేతలకు వెలిగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. కొండలను బద్దలు కొట్టి కరువు ప్రాంతాల్లో నీరు పారించిన చరిత్ర చంద్రబాబుదేనని మంత్రి పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తవడంతో మార్కాపురం ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయ రంగం రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులకు కేవలం 48 రోజుల్లో రూ. 768 కోట్ల పరిహారం అందించడం రికార్డుగా నిలిచిందన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ప్రకాశం జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీటి భద్రత మరింత బలోపేతమవుతుందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో వ్యవసాయం, ఉద్యానవనం, ఉపాధి అవకాశాలు పెరిగి మార్కాపురం ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా మార్కాపురం ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కల సాకారం అవుతున్న వేళ.. వెలిగొండ ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోయే ఘట్టంగా మారనుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

# కరువు నేలకు కృష్ణమ్మ వరప్రదాయిని.. వెలిగొండతో రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు

- **4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. లక్షలాది ప్రజలకు తాగునీటి భరోసా**
- **నాడు శంకుస్థాపన చేసిన చంద్రబాబు చేతుల మీదుగానే నేడు జాతికి అంకితం**
- **మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి దూరదృష్టికి వెలిగొండ నిలువెత్తు నిదర్శనం**
- **వెలిగొండతో కరువు, వలసలకు శాశ్వత పరిష్కారం - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దశాబ్దాలుగా కరువుతో అల్లాడుతున్న ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల రైతుల జీవితాల్లో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కొత్త వెలుగులు నింపబోతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న సందర్భం రాష్ట్ర సాగునీటి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి 43.53 టీఎంసీల కృష్ణా వరద జలాలను నల్లమల కొండల గుండా మళ్లించి, మొత్తం 4,47,300 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్టును రూపొందించారని మంత్రి తెలిపారు. మార్కాపురం జిల్లాలో 3,08,700 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 27,400 ఎకరాలు, వైఎస్ఆర్ కడప జిల్లాలో 27,200 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84,000 ఎకరాలకు సాగునీరు అందేలా ప్రాజెక్టు రూపకల్పన జరిగిందన్నారు.

వెలిగొండ అంటే కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదు. తరతరాలుగా కరువుతో పోరాడిన రైతుకు భరోసా.. నీటి కోసం ఎదురుచూసిన గ్రామాలకు జీవనాధారం.. ఉపాధి కోసం వలస వెళ్లిన కుటుంబాలకు సొంత గడ్డపైనే బతికే అవకాశం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం, నీటి వసతుల లేమి కారణంగా ప్రజలు కరువు కాటకాలను ఎదుర్కొంటూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవని అన్నారు. వెలిగొండ ద్వారా సాగునీటితో పాటు కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో లక్షలాది ప్రజలకు సురక్షిత తాగునీటి భరోసా లభిస్తుందని మంత్రి తెలిపారు. 4 జిల్లాల్లోని 30 మండలాలకు చెందిన 15.25 లక్షల మందికి కాలువల నెట్‌వర్క్ ద్వారా తాగునీటి సౌకర్యం, పశ్చిమ ప్రకాశంలోని 7 నియోజకవర్గాల్లో 1,657 ఆవాసాలకు తాగునీటి ప్రయోజనం కలగనుందన్నారు. 23 లక్షల ప్రజానీకానికి తాగునీరు అందించేందుకు ప్రాజెక్టు రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారని తెలిపారు. నల్లమలసాగర్ జలాశయం నిండటం, కాలువలు-- చెరువులకు నీరు చేరడం వల్ల ఆయకట్టు ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి మెట్ట ప్రాంత వ్యవసాయ ముఖచిత్రమే మారే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 30 నుంచి 60 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు కొన్ని ప్రాంతాల్లో సుమారు 8 మీటర్ల లోతులోనే అందుబాటులోకి వచ్చే అవకాశముందని ప్రాజెక్టు నివేదిక అంచనా వేసిందని పేర్కొన్నారు.



నాడు 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేసిన నాయకుడు చంద్రబాబు నాయుడు. నేడు అదే ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేసే చారిత్రక ఘట్టానికి ఆయన నాయకత్వం వహించడం అరుదైన సందర్భం. ఒక నాయకుడి దూరదృష్టి మూడు దశాబ్దాల తర్వాత లక్షలాది మంది ప్రజల జీవితాలను ఎలా మార్చగలదో చెప్పడానికి వెలిగొండ ప్రత్యక్ష నిదర్శనం అని అచ్చెన్నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పెండింగ్ పనులకు వేగం పెంచిందన్నారు. టన్నెల్–2లో మిగిలిన 4.924 కిలోమీటర్ల బోరింగ్‌ను 23 నెలల్లో పూర్తి చేయడం, హెడ్ రెగ్యులేటర్లు, సొరంగాలు, ఫీడర్ కాలువ తదితర కీలక పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కేవలం 26 నెలల్లో దాదాపు రూ. 2,402 కోట్ల విలువైన పనులు పూర్తి చేసినట్లు, నల్లమల కొండల్లో దాదాపు 18.8 కిలోమీటర్ల పొడవుతో నిర్మించిన రెండు భారీ సొరంగాలు ఇంజినీరింగ్ అద్భుతమని మంత్రి పేర్కొన్నారు. ఈ రెండు సొరంగాల ద్వారా వరద సమయంలో కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించేలా వ్యవస్థను రూపొందించారని తెలిపారు. నల్లమలసాగర్ నుంచి తీగలేరు, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువల ద్వారా విస్తారమైన ఆయకట్టుకు సాగునీరు చేరుతుందని అన్నారు. వెలిగొండ నీరు రైతు పొలానికి చేరితే అది కేవలం నీరు కాదు.. రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా. చెరువులు నిండుతాయి, భూగర్భ జలాలు పెరుగుతాయి, బోర్లు బతుకుతాయి, పంటలు పండుతాయి, గ్రామాల్లో ఉపాధి పెరుగుతుంది. ముఖ్యంగా కరువు కారణంగా జరిగే వలసలకు అడ్డుకట్ట పడుతుంది. అందుకే వెలిగొండను ఈ ప్రాంత ప్రజల జీవనరేఖగా చూడాలి అని అచ్చెన్నాయుడు అన్నారు. రైతుల సంక్షేమం, సాగునీటి భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. నదుల అనుసంధానం నుంచి పోలవరం వరకు, హంద్రీ--నీవా నుంచి వెలిగొండ వరకు నీటిని సంపద సృష్టించే శక్తిగా మార్చాలన్నదే చంద్రబాబు ఆలోచన. నేడు వెలిగొండ జాతికి అంకితం కావడం ఒక ప్రాజెక్టు ప్రారంభం మాత్రమే కాదు, కరువు సీమలో రైతుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే కొత్త అధ్యాయం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# తెలంగాణ యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్య శిక్షణ

- ప్రభుత్వ ఐటీఐల్లో టాటా టెక్నాలజీస్ సహకారంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలు
- ఆరు ప్రత్యేక టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ
- యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**గద్వాల, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సహకారంతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ యువతకు ఆధునిక నైపుణ్య, సాంకేతిక శిక్షణ అందించే సంస్థలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ సీతా రాములు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆధునిక సాంకేతిక శిక్షణ కోర్సులకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అధునాతన మౌలిక సదుపాయాలు, ఆధునిక ప్రయోగశాలలు, యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, పాఠ్యప్రణాళికలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు.

**బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎమ్మెల్యే మాట్లాడుతూ..**

యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా ప్రస్తుత పరిశ్రమలకు అవసరమైన ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. టెక్నాలజీ రంగంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా శిక్షణ పొందితే భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను గద్వాల నియోజకవర్గంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆరు ప్రత్యేక టెక్నాలజీ కోర్సులను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. సీ.ఎన్.సీ మెషినింగ్ టెక్నీషియన్ కోర్సు రెండు సంవత్సరాలు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సు ఒక సంవత్సరం, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సు రెండు సంవత్సరాలు, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ కోర్సు ఒక సంవత్సరం, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సు ఒక సంవత్సరం, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ కోర్సు రెండు సంవత్సరాల వ్యవధితో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోబోటిక్స్, పారిశ్రామిక ఆటోమేషన్, ఎలక్ట్రానిక్ వాహనాలు, డిజిటల్ తయారీ విధానాలు, ఆధునిక ఉత్పత్తి వ్యవస్థలు వంటి సాంకేతిక రంగాల్లో యువతకు నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. సంప్రదాయ వృత్తి శిక్షణకు, ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి, విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయడమే ఈ భాగస్వామ్య కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ కోర్సులకు అడ్మిషన్లు ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. గద్వాల నియోజకవర్గంలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పూర్తి వివరాల కోసం గవర్నమెంట్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, నాయకులు రామకృష్ణారెడ్డి, గద్వాల తిమ్మప్ప, మేస్త్రి తిమ్మప్ప, కృష్ణ, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు రూపొందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్
- మండల స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, టెక్నికల్ సిబ్బందికి అవగాహన సదస్సు..



**దేవరకద్ర, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామాల స్థానిక అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ సమగ్ర అభివృద్ధికి పకడ్బందీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో VGPPపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు, మండల స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, టెక్నికల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, పరిపాలన, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన శిక్షణలో ఇచ్చిన సూచనలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య రంగాలతో పాటు తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అవసరాలను గుర్తించాలని, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రణాళికల అమలులో నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి మండలంలో గ్రామ పంచాయతీల వారీగా ప్లానింగ్ షెడ్యూల్ సిద్ధం చేసి, మండల స్థాయి ప్లానింగ్ బృందాల ఏర్పాటు వివరాలను సమర్పించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టాలి ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఫార్మ్ పాండ్స్, ట్రెంచ్‌లు, సోక్‌పిట్స్, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. జిల్లాలో కురిసే ప్రతి చుక్క వర్షపు నీటిని సాధ్యమైనంత వరకు జిల్లాలోనే నిల్వ చేసి, భూగర్భ జలాలను రీచార్జ్ చేసేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. రైతులు ఫార్మ్ పాండ్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చేలా అధికారులు అవగాహన కల్పించడంతో పాటు వారిని ప్రోత్సహించాలని సూచించారు.

రైతులకు కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా ఫార్మ్ పాండ్స్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని అన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో బోర్లలో నీటి లభ్యత మెరుగుపడి పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేయాలి.ఎం.పి.డి.ఓ లు, ఎం.పి.ఓ లు, ఏ. పి.ఓ లు తమ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయించాలని మధుసూదన్ నాయక్ అన్నారు. అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి, సర్పంచులు, ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. మండల స్థాయిలో అధికారుల మధ్య సమన్వయం మరింత పెరగాలని, ప్రతి గ్రామంలో జరుగుతున్న పనులు, వాటి పురోగతి, ఎదురవుతున్న సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నప్పటికీ, అందుకు అనుగుణంగా పనిదినాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రతి మండలంలో లేబర్ తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, కారణాలను విశ్లేషించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు, కూలి చెల్లింపులు, ప్రభుత్వ పనుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని అభివృద్ధి సూచీల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. మండల స్థాయిలో పనిచేసే ఎంపీడీవోలు ప్రజలకు అత్యంత చేరువగా ఉండే కీలక అధికారులు అని పేర్కొంటూ, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా ముందుండి పనిచేయాలని సూచించారు. అధికారుల సమిష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలని, ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని మధుసూదన్ నాయక్ కోరారు. అంతకు ముందు, డి. ఆర్. డి.ఓ నరసింహులు,

వి. జి. పి. పి ప్రణాళిక ను అన్ని శాఖల కన్వర్జెన్స్ తో రూపొందించుకోవాలని అన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, పశుసంవర్ధక శాఖ జె.డి శివానంద స్వామి, మత్స్యశాఖ డి.డి రాధ రోహిణి మాట్లాడుతూ వారి వారి శాఖల ద్వారా అమలుచేస్తున్న పథకాలు, చేపడుతున్న పనులు, వాటి నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా శాఖల ద్వారా చేస్తున్న, చేయబోయే పనులను కూడా గ్రామ పంచాయతీ ప్రణాళికలో పొందపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్.పి.సి.ఈ.ఓ, ఇంచార్జ్ డి.పి.ఓ వెంకట రెడ్డి, అదనపు డి . ఆర్.డి.ఓ వామనరావు, అన్ని మండలాల ఎం.పి.డి ఓలు, ఎ.పి.ఓ లు, ఈ.సిలు, టి.ఎలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

- అవార్డు పూర్తయిన రైతుల ఖాతాల్లో వెంటనే పరిహారం జమ
- సాగునీటి విడుదలపై స్పష్టతతో ముందుకెళ్లాలి
- అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో పురోగతిలో ఉన్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. అవార్డు పూర్తయిన రైతుల ఖాతాల్లో వెంటనే పరిహారం జమ చేయాలని సూచించారు. నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణపై శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల వారీగా వివిధ మండలాల పరిధిలో సేకరించాల్సిన భూములు, భూ సేకరణ పురోగతిపై అధికారులతో సమీక్షించారు. నీటిపారుదల, రెవెన్యూ, భూ సేకరణ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భూ సేకరణకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో రైతులతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురు స్తున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినప్పటికీ, జిల్లాలోని వివిధ రిజర్వాయర్ల పరిధిలో కొంత మంది రైతులు వరి సాగు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జూరాల కుడి కాలువ పరిధిలోని చివరి డిస్ట్రిబ్యూటర్ల వరకు సాగునీటి సరఫరాపై ఇరిగేషన్ అధికారులు స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. పంట చేతికి వచ్చే వరకు రైతులు నష్టపోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ముగిసే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ..**

ప్రాజెక్టుల భూ సేకరణకు ఉన్న అడ్డంకులను అధిగమించి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేసి నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని వివిధ ప్యాకేజీలకు అవసరమైన భూ సేకరణను వేగవంతం చేయాలని కోరారు. గట్టు ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూ సేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జూరాల ప్రాజెక్టుకు కొద్ది రోజులుగా నిరంతరం ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పలు రిజర్వాయర్లను నింపుకునే అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే తెలిపారు. జూరాల కుడి కాలువతో పాటు వివిధ రిజర్వాయర్ల పరిధిలో కొందరు రైతులు వరి సాగు చేసినప్పటికీ సరైన ప్రణాళికతో పంట చేతికి వచ్చే వరకు సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు నష్టపోకుండా చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గత కొన్నేళ్లుగా జిల్లాలో రైతులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఖరీఫ్, రబీ సీజన్లను విజయవంతంగా నిర్వహించుకున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నప్పటికీ జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి వరద వస్తుండటం జిల్లాకు మేలు చేస్తోందన్నారు. రైతులు ఆరుతడి పంటలతోనూ ప్రయోజనం పొందేలా జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే అవగాహన కల్పించిందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఇరిగేషన్ సీఈ రహీముద్దీన్, ఎస్ఈ కేశవరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, పలు మండలాల తహసీల్దార్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సార్.. నేను బ్రతికే అవకాశం కల్పించండి కన్నీటితో వేడుకుంటున్నా బాలిక



**నర్సంపేట, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని నక్కలగుట్ట తండా గ్రామ పంచాయతీకి చెందిన 14 సంవత్సరాల గిరిజన లంబాడ బిడ్డ జాటోత్ పవిత్ర ఆమె తండ్రి. రాములు గత 14 సంవత్సరాలుగా తల సేమియా వ్యాధితో బాధపడుతుంది.. ఇంటికన్నె గ్రామంలోని ప్రాథమి ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి అడ్మిషన్ అయినది. ఈ వ్యాధి ఎక్కువ కావడంతో రెండు కాళ్లు కూడా వంకర అయి నడవలేని స్థితిలో పాఠశాలకు వెళ్లకుండా ఇంటి కె పరిమితమైనది. వారి తల్లిదండ్రులకున్న 20 గుంటల భూమిని అమ్మి కూతురి ఆరోగ్యం కై ఖర్చు పెట్టారు. నేడు వాళ్ళ పరిస్థితి రెక్కాడితే కానీ డొక్కాడని దుర్భర దారిద్రానికి చేరువైనది. కనీసం ప్రభుత్వ పెన్షన్ పొందాలంటే ఆన్లైన్లో తలసేమియాకు అవకాశం లేదు.. గల్లి నుండి కలెక్టర్ వరకు అనేకచోట్ల ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం శూన్యం.... ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం తల సేమియా వ్యాధిగ్రస్తులకు పింఛన్ అవకాశం కల్పించినది.... కానీ సదరన్ క్యాంపుకు వెళ్లాలంటే ఆన్లైన్ చేయించుకోవాలి ఆ అవకాశం వెబ్ సైట్ లో లేకపోవడంతో అప్లికేషన్ తేదీ దగ్గర పడడంతో దిక్కుతోచని స్థితిలో... కన్నీటిపర్వంతో ఇక నా కూతురి కి పింఛన్ రాదు.. ఆరోగ్యం కుదుటపడే అవకాశం లేదు.... చికిత్స చేయించాలన్న చేతుల చిల్లి గవ్వ లేదు అంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్వంతో చివరిసారిగా ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి స్పందించి పింఛన్ అవకాశం కల్పించగలరని వేడుకుంటున్నారు.... అలాగే నా కూతురు ఆరోగ్య పరిస్థితి చూసి దాతలు అయిన నా కూతురైన పవిత్ర బ్యాంక్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ IFSC CODE TGRB0005131 అకౌంట్ 73211881442 ఫోన్ పే... గూగుల్ పే చీ. 9515446146 కి సహాయం చేసి ఆశీర్వదించగలరని వేడుకుంటున్నారు.

## క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయి

– సోషల్ వెల్ఫేర్ పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ జోష్నా



**పర్వతగిరి, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల తో పాటు, మానసిక వికాసానికి, బుద్ధి బలానికి ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ జోష్నా తెలిపారు. శనివారం పర్వతగిరి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో భారత హాకీ దిగ్గజం, హాకీ విజార్డ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని "జాతీయ క్రీడా దినోత్సవాన్ని" వైభవంగా, ఘనంగా నిర్వహించారు. వివిధ ఆటలకు సంబంధించిన ఆట వస్తువులను ప్రదర్శించారు. క్రీడలు విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందిస్తాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆటలలో రాణించిన వివిధ తరగతుల విద్యార్థులను మెడల్స్ తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.డి స్రవంతి, పిఈటి మమత, ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి భవన్‌లో కల్వకుర్తి ఏకలవ్య విద్యార్థిని



**కల్వకుర్తి, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)కు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎ.వైష్ణవి పాల్గొన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం వైష్ణవికి లభించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థిని పాల్గొనడం ఎంతో గర్వకారణమన్నారు. ఇది ఈఎంఆర్ఎస్ కల్వకుర్తి నియోజకవర్గంలోనే చరిత్రలో మరపురాని ఘట్టమని పేర్కొన్నారు.వైష్ణవిని ప్రిన్సిపాల్ సుమన్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు రీనా, అనీషా, గీతు చంద్రన్, విద్యార్థులు అభినందించారు.

## రాహుల్ గాంధీ ప్రధాని కావడమే మా అందరి కోరిక

– పాదయాత్రకు సంపత్ కుమార్ సంఘీభావం

– ఎర్రవల్లి నుంచి బీచుపల్లి వరకు 5 కిలోమీటర్లు నడిచిన మాజీ ఎమ్మెల్యే



**గద్వాల, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే ఆకాంక్షతో ఒంగోలుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది కాటూరి వెంకటేశ్వర్లు చేపట్టిన 'RAGA FOR RISE OF INDIA' పాదయాత్రకు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ సంఘీభావం తెలిపారు. శనివారం ఎర్రవల్లి భారత్ పెట్రోల్ బంక్ నుంచి బీచుపల్లి హనుమాన్ ఆలయం వరకు కాటూరి వెంకటేశ్వర్లుతో కలిసి సుమారు 5 కిలోమీటర్లు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ అందరి కోరిక అని అన్నారు. దేశంలో, ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. జూన్ 19న ప్రారంభమైన ఈ పాదయాత్ర కేరళ, తమిళనాడు, కర్ణాటక మీదుగా తెలంగాణలోకి ప్రవేశించిందని తెలిపారు. పాదయాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ కాటూరి వెంకటేశ్వర్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, అన్ని మండలాల మండల అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, అధికార ప్రతినిధులు, పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల వద్దకే వెళ్లి ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

– జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** నారాయణపేట జిల్లా పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు, పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఉన్న వారి వద్దకే వెళ్లి ఆన్‌సైట్‌లో ఫిర్యాదు స్వీకరించి FIR నమోదు చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పోలీసు అధికారులను టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలు తమకు ఏవైనా సమస్యలు, ఇబ్బందులు లేదా నేరానికి సంబంధించిన ఫిర్యాదులు ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో అక్కడికక్కడే ఆన్‌సైట్ FIR నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలి అని ఆయన తెలిపారు.ముఖ్యంగా వృద్ధులు, మహి ళలు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు, గాయపడిన బాధితులు, పిల్లలు/మైనర్లు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు, అలాగే దూరప్రాంతాల్లో ఉన్న బాధితులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. బాధితుల భద్రత, గౌరవం, గోప్యతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలకు పోలీస్ శాఖ పై నమ్మకం మరింత పెరిగేలా ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలనీ ఎస్పీ తెలిపారు.

## పలు పి.హెచ్.సి.లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ.శ్రీనివాసులు



**దేవరకద్ర, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** మహాముదాబాద్,గండీడ్,హన్వాడ పి. హెచ్.సి. లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ.శ్రీనివాసులు తనిఖీచేశారు.తనిఖీలలో భాగంగా వాక్సిన్ నిల్వలు, మందుల నిల్వలు, రోగ నిర్ధారణ సేవలు (ల్యాబ్ సర్వీసెస్ ), సిబ్బంది హాజరు వివరాలు,ఆసుపత్రులలోని పరిశుభ్రతను పరిశీలించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ కాన్పులు పెంచాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై మరింత నమ్మకమును కల్గించాలని ఆదేశించారు.కార్యక్రమంలో డా.రాజు, డా. పులి విద్య, సుభాష్ చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రూప్-1, 2, 3, 4 ఉచిత ఫౌండేషన్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

– సెప్టెంబర్ 1 నుంచి 14 వరకు దరఖాస్తుల స్వీకరణ

– జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా

**గద్వాల, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1, 2, 3, 4 పరీక్షలకు సిద్ధమయ్యే మైనారిటీ అభ్యర్థుల కోసం అందిస్తున్న ఉచిత ఫౌండేషన్ కోచింగ్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైన మైనారిటీ వర్గాలకు చెందిన బీపీఎల్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండటంతో పాటు బీపీఎల్ కేటగిరీకి చెందినవారై ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో సెప్టెంబర్ 1 నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణా తరగతులు సెప్టెంబర్ 15, 2026 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. శిక్షణా తరగతులు హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని కాలేజీ, ఎంఏఎం క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

మరిన్ని వివరాల కోసం 040-3236112, 90590 50062 ఫోన్ నంబర్లను లేదా mailto: directorsccctelangana@gmail.com ఈ-మెయిల్‌ను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని అర్హులైన మైనారిటీ యువతీ యువకులు ఈ ఉచిత ఫౌండేషన్ కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలకు మెరుగైన సన్నద్ధత పొందాలని సయ్యద్ అక్బర్ పాషా కోరారు.

# కడప ఎమ్మెల్యే మాధవికి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నేత ధూపం రాజు



**కడప,ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి పుట్టిన రోజు సంద ర్భంగా శనివారం స్థానిక 48 వ డివిజన్ టిడిపి నాయ కులు, బేడబుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్య క్షుడు ధూపం రాజు, పసుపు లేటి మనోజ్ కుమార్ లు నగరం లోని ద్వారకానగర్ లో ఉన్న ఎమ్మెల్యే స్వగృహంలో ఆమెను కలిసి పూల బుకే అందించి శాలు వాతో సత్కరించి శుభాకాం క్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాధవి రెడ్డి డివిజన్ సమ స్యలను అడిగి తెలుసు కున్నా రు.అనంతరం ధూపం రాజు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు తమరు చేస్తున్న కృషి అభినం దనీయని, ఎప్పుడూ నియోజ కవర్గ ప్రజల కు అందుబాటులో ఉంటూ ప్రజలకోసం శ్రమించడం ప్రసంశ నీయమన్నారు.ఎమ్మెల్లే ఆయు రారోగ్యాలతో ఉంటూ మరిన్ని ఉన్నత హోదాలు అధి రోహిం చాలని ఆకాంక్షించారు. అలాగే తెలుగు దేశం కోసం కష్టప డుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే భర్త ఆర్ శ్రీనివాసుల రెడ్డికి ఆయన శుభా కాంక్షలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో ,డి మహేష్,పి బ్రహ్మ య్య,డి మల్లికార్జున, పి సురేష్ లతో పాటు సంచార జాతుల ముద్దుబిడ్డలు, పసుపు లేటి మనోజ్ కుమార్ గోవింద్, అంజ నేయులు కూడా ఎమ్మెల్యే మాధవి రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు

# శేరిపల్లి విద్యార్థులకు అయ్యప్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా గురుకుల బుక్స్ పంపిణీ....

**శ్రీరంగపుర్, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

శనివారం శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి విద్యార్థులకు అయ్యప్ రెడ్డి ఫౌండేషన్ వారు గురుకుల మెటీరియల్ ను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి మేకల వెంకటయ్య విశిష్ట అతిథులు మండల విద్యాధికారి హనుమంత్ , కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జ్యోతి , ఏకల్ సంస్థ లక్ష్మి , వార్డు నెంబర్ సురేష్ , CRP శ్రీలత , ప్రధానోపాధ్యాయులు నరసింహ సార్ గారు, ఉపాధ్యాయులు రమేష్ , పృథ్వి మాత , చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు





# ఫ్లేర్ హైస్కూల్‌లో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం



**నిర్మల్‌జిల్లా, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

దిలావర్‌పూర్ మండలంలోని ఫ్లేర్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనం, ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగాలు, కవితలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన జీవనశైలిలో క్రీడల పాత్రపై అవగాహన కల్పించారు. వివిధ క్రీడా కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.వి. నరసింహారెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జ్ భోజారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు భాషను పరిరక్షిస్తూ, మాతృభాష పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవడంతో పాటు క్రీడల్లో చురుగ్గా పాల్గొని ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు.

# ఘట్టమ్మ ఆలయం వద్ద భక్తుల పై వ్యాపురుల వేధింపులు!

- అడ్డగోలు వసూళ్లు.. వ్యాపారుల దురుసు ప్రవర్తనపై భక్తుల ఆగ్రహం
- వృద్ధ యాచకుల వేధింపులతో భక్తులకు అవస్థలు
- అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని భక్తుల డిమాండ్

**ములుగు, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రసిద్ధ ఘట్టమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తుల భక్తిని ఆసరాగా చేసుకుని అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారని, కొందరు వ్యాపారులు భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులు పూజా సామగ్రి కొనుగోలు, మొక్కులు చెల్లించే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆలయ పరిసరాల్లో కొబ్బరికాయను ఏకంగా రూ.50కు విక్రయిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. అలాగే మేకలు, కోళ్ల కోతకు నిర్ణీత రుసుములకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. నగదు లేని భక్తులకు ఆన్‌లైన్ చెల్లింపుల కోసం ఫోన్‌పే వంటి సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని చెబుతున్నారు.ధరలు, అదనపు రుసుములపై ప్రశ్నించిన భక్తులతో కొందరు వ్యాపారులు అనాగరికంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తుల సౌకర్యం, ఆలయ ప్రతిష్టకు విఘాతం కలిగించే ఇటువంటి ఘటనలపై దేవాదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ అవసరం**

ఆలయ ప్రాంగణంలో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి, వ్యాపారుల వసూళ్లపై నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ప్రతి వస్తువు, సేవకు సంబంధించిన అధికారిక ధరల పట్టికలను భక్తులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తూ భక్తులను ఇబ్బందులకు గురిచేసే వ్యాపారులు, సంబంధిత సిబ్బందిపై విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేవాదాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**యాచకుల వేధింపులతో భక్తుల అవస్థలు**

దీనికి తోడు ఆలయ పరిసరాల్లో కొందరు వృద్ధులు యాచిస్తూ భక్తులను పదేపదే డబ్బులు అడుగుతున్నారని,డబ్బులు ఇవ్వని భక్తులను తిడుతూ అసభ్యంగా మాట్లాడుతున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కుటుంబ సభ్యులు, చిన్నారులు, వృద్ధులతో కలిసి ఆలయానికి వచ్చే భక్తులు ఇలాంటి పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.భక్తుల ప్రశాంతమైన దర్శనానికి ఆటంకం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించకుండా ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.యాచకుల సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించడంతో పాటు,భక్తులను వేధింపులకు గురిచేస్తున్న వారిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# యోగాలో సత్తా చాటిన రబింద్రా విద్యార్థులు



**నిర్మల్‌జిల్లా, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

ముధోల్ స్థానిక రబింద్రా ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చాటారు. భైంసాలోని సంస్కార్ పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రబింద్రా పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-1416 విభాగంలో మధుప్రియ, అండర్-1214 విభాగంలో విఘ్నేష్ బంగారు పతకాలు సాధించారు. అండర్-1012 విభాగంలో లోక్షిత రజత పతకం సాధించగా, ఫమన్, అమానియా అక్తర్ నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ.. యోగా ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు రోగాలను దూరం చేయడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడి జీవితంలో సుఖసంతోషాలు లభిస్తాయని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు యోగా పోటీల్లో పతకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. త్వరలో రాష్ట్రస్థాయి యోగా పోటీల్లోనూ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు యోగా మెలకువలు నేర్పించి, పోటీల్లో పతకాలు సాధించేలా కృషి చేసిన యోగా గురువు ఉప్పు రవీందర్‌ను పాఠశాల తరపున సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దాలి

## - కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు





**ములుగు, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రణాళికాబద్ధమైన బోధనతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. విద్యార్థినులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలని తెలిపారు.శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని నిఘా కెమెరాల పనితీరును, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు.జూనియర్ కళాశాల విద్యార్థినులకు నిర్వహిస్తున్న యూనిట్ పరీక్షలను పరిశీలించిన కలెక్టర్, పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థినులకు నిర్ణీత ఆహార పట్టిక ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం మెనూ ప్రకారం అందించాల్సిన భోజన పదార్థాలను పరిశీలించి, భోజనం తయారీలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, వారి విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, రికార్డు అసిస్టెంట్ రాజు, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

- రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించాలి
- మల్లంపల్లి రైతు వేదికలో రైతులుశాస్త్రవేత్తల ముఖాముఖి

**జీడిమల్లంపల్లి, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు,సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం,ములుగు శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. విశ్వతేజ సూచించారు.మల్లంపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ,ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతులుశాస్త్రవేత్తల ముఖాముఖి" కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.వరి,పత్తి, మిరప,మొక్కజొన్న తదితర పంటల్లో తీసుకోవాల్సిన సాగు, సస్యరక్షణ చర్యలను వివరించారు. పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి వేప ఆధారిత ఉత్పత్తులు,జిగురు అట్టలు,లింగాకర్షక బుట్టలను వినియోగించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తక్కువగా ఉన్న రైతులు వరికి బదులుగా జొన్న, పెసర,



బొబ్బెర వంటి తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు.వ్యవసాయ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ మండలంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, మొబైల్ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం రైతులు అడిగిన పంటల సాగు, సస్యరక్షణకు సంబంధించిన సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు.కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ కొంగరి పైడి,బిలావత్ మల్లిక,వార్డు సభ్యులు జింక వేణు,ఎం.డి. అంకుష్,సోన్‌రెడ్డి దిలీప్,చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,ఏఈఓ జ్యోతిరాణి,రైతులు జగ్గురం,ఇమ్మడి ప్రవీణ్,గొర్రె మహేందర్,మల్లారెడ్డి,కిరణ్,అరుణ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు మీరితే చర్యలు తప్పవు..

## కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



**సైబరాబాద్, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**



భవన నిర్మాణ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని సైబరాబాద్ నగరపాలక సంస్థ (సీఎంసీ) స్పష్టం చేసింది. సంస్థ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు చేపట్టిన క్షేత్రస్థాయి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ శనివారం కూడా కొనసాగింది. ఈ తనిఖీల్లో అధికారులు మొత్తం 26 అక్రమ నిర్మాణాలను గుర్తించగా, వాటిలో 19 కట్టడాలను వెంటనే నేలమట్టం చేసి, మరో 12 నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. జోన్ల వారీగా చూస్తే శేరిలింగంపల్లిలో 9, కూకట్‌పల్లిలో 4, కుత్బుల్లాపూర్‌లో 6 అక్రమ కట్టడాలను కూల్చివేశారు. గుర్తించిన మిగిలిన 7 నిర్మాణాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని, చట్టవిరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని, ఈ స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని నగరపాలక సంస్థ అధికారులు హెచ్చరించారు.

# గీత కార్మికుల సంక్షేమానికి ఈత మొక్కలు





- భవిష్యత్‌లో గీత కార్మికులకు జీవనోపాధికి ఆసరా
- ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు

**ఏటూరు నాగారం, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

గీత కార్మికుల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి చేయూత అందించాలనే లక్ష్యంతో అటవీ శాఖ,డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈత మొక్కలను నాటారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు హాజరై అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీత కార్మికుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఈత మొక్కలు నాటడం అభినందనీయమన్నారు.భవిష్యత్తులో ఈ మొక్కలు గీత కార్మికులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణతో పాటు గీత కార్మికుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు.కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్‌రావు, ఎం.డి. వలీబాబా, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్‌గౌడ్, సప్పిడి రాంనర్సయ్య, తురం పద్మ, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కార్యదర్శి జనార్దన్, కన్నబోయిన రాజు యాదవ్, గౌడ సంఘం నాయకులు సప్పిడి రామ్, కొండల్, రఘు, మొగిలి, పాలకుర్తి విజయ్, తాళ్లపెల్లి మోహన్, మెరుపు వెంకటేశ్వర్లు, సది, కొండాయి చిన్ని, అటవీ శాఖ అధికారులు, గౌడ సంఘం నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సంతోష్ కు అంతర్జాతీయ గుర్తింపు

**తాండూర్, ఆగస్టు 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

మూడు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాండూర్ మండలానికి చెందిన అభినవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కేశెట్టి సంతోష్ కుమార్ కు అంతర్జాతీయ గౌరవం దక్కింది. పుదుచ్చేరిలోని కంబన్ కలైయరంగం ఆడిటోరియంలో నిర్వహించిన సామాజిక నాయకులు,దార్శనికుల,సమ్మేళనం-2026 కార్యక్రమంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆయనకు సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డా.కె.వెంకటేశన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొన్నారు. తన గత 30 ఏళ్లుగా 98 సార్లు రక్తదానం చేయడంతో పాటు పేదలకు అన్నదానం, వస్త్రదానం, విద్యా-వైద్య సహాయం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 17 ఏళ్లుగా మట్టి గణపతుల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలోనూ ప్రజలకు అండగా నిలిచారు. ఈ గౌరవం తన ఒక్కడి విజయం కాదని, తనకు సహకరించిన దాతలు, అధికారులు, మీడియా మిత్రులు, కుటుంబ సభ్యులందరిదని, బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవ చేస్తానని సంతోష్ కుమార్ తెలిపారు.



## నీట్-పీజీ పరీక్షకు పటిష్ట భద్రత




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):**అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసిన పరీక్ష . నీట్–పీజీ పరీక్ష నేపథ్యంలో గుంటూరు జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాల వద్ద జిల్లా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సౌత్ డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్ష ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల, హరినాథ్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్.వి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ––చేబ్రోలు, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్––పేరేచర్ల, ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్––ఐదవ మైలు, కొర్నెపూడి తదితర పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల ప్రవేశం, నిష్క్రమణ, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టారు.

పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సౌత్ డీఎస్పీ స్వయంగా పరిశీలించి విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష నిర్వాహకులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్రాల వద్ద ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించారు.

గుంటూరు జిల్లా పోలీసుల పటిష్టమైన భద్రతా చర్యలు, సమన్వయంతో నీట్––పీజీ పరీక్ష ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## కుష్టువ్యాధిగ్రస్తుల పిల్లల విద్యకు డబుల్ హార్స్ ఆర్థిక సాయం




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** కుష్టువ్యాధిగ్రస్తుల పిల్లల ఉన్నత విద్యకు డబుల్ హార్స్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించింది. లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో తెనాలిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పది మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందించారు.

తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్లు ప్రతినిధుల సహకారంతో లెప్రా సొసైటీ ద్వారా అందించిన ఈ ఆర్థిక సహాయాన్ని తెనాలి మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి, డీపీఎంఓ జంగం శ్యామ్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఉన్నత విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

లెప్రా సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త రాధిక మాట్లాడుతూ డబుల్ హార్స్ ఫౌండేషన్ సహకారంతో పది మంది విద్యార్థులకు మొత్తం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కుష్టువ్యాధిగ్రస్తుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యలో ముందుకు సాగేందుకు ఇటువంటి సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

లెప్రా సొసైటీ ప్రాజెక్టు అసోసియేట్ అబ్దుల్ వహీద్ భాష మాట్లాడుతూ తమ ఆపరేషన్ పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు విద్యాభ్యాసానికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. తెనాలిలో విద్యార్థులకు బ్యాంకు చెక్కులను సబ్‌యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి ద్వారా అందజేసినట్లు చెప్పారు. విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించిన డబుల్ హార్స్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో కోఆర్డినేటర్ సాతిరి రమణయ్య, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, సూపర్‌వైజర్ తిరువీధుల శివరామప్రసాద్, మల్లోల యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి

### గుంటూరు జిల్లా పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** నేరాలకు దూరంగా ఉంటూ చట్టాలను గౌరవించి బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని గుంటూరు జిల్లా పోలీసులు రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి సూచించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని, భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా చట్టబద్ధమైన జీవనం సాగించాలని సూచించారు. కుటుంబ సభ్యుల భవిష్యత్తు, సమాజంలో తమ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని చెడు స్నేహాలు, అసాంఘిక కార్యకలాపాలు, నేరప్రవృత్తికి పూర్తిగా దూరంగా ఉండాలని హితవు పలికారు.

ప్రజల ప్రశాంతతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, నేరప్రవృత్తి ఉన్న వారిపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తారని తెలిపారు.

అదే సమయంలో నేరాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సమాజంలో ప్రశాంతంగా, చట్టబద్ధంగా జీవించేవారికి పోలీసుల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని అధికారులు స్పష్టం చేశారు. నేరప్రవృత్తి నుంచి బయటపడి సాధారణ జీవితం సాగించేందుకు ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

నేరరహిత సమాజ నిర్మాణం, ప్రజలకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడమే గుంటూరు జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. నేర నియంత్రణతో పాటు నేరాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడానికీ ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## ఆనితర సాధ్యులు సీఎం చంద్రబాబు



- 30 ఏళ్ల వెలిగొండ కల సాకారం
- కృష్ణమ్మను కరవు నేలకు తీసుకురావటం ఆయన సంకల్పానికి నిదర్శనం
- సీఎంకు సత్యకుమార్ అభినందనలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్–1 ప్రారంభం కానుండటం ప్రకాశం, మార్కాపురం ప్రాంత ప్రజలకు చారిత్రాత్మక సందర్భమని బీజేపీ జాతీయ నాయకుడు, రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే ఇప్పుడు తొలి దశను ప్రారంభిస్తుండటం ఆయన సంకల్పబలానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత పనులను వేగవంతం చేసి కీలక దశకు తీసుకొచ్చిన సీఎంకు అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన నిర్వాసితుల సహకారం చిరస్మరణీయమని, 6,206 కుటుంబాలకు రూ. 768 కోట్ల పరిహారం అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. తమ త్యాగంతో లక్షలాది ఎకరాలకు సాగునీరు, సుమారు 25 లక్షల మందికి తాగునీరు అందనుందనే సంతృప్తితో నిర్వాసితులు ఉన్నారని తెలిపారు.

వెలిగొండ జలాల రాకతో సాగునీటి భద్రత పెరగడంతో వ్యవసాయంలో పంటల వైవిధ్యానికి అవకాశం కలుగుతుందని, ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమ, విత్తనోత్పత్తి వంటి అనుబంధ రంగాలు విస్తరిస్తాయని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజీ, గిడ్డంగుల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. నీటి వనరులతో పాటు రహదారులు, మార్కెట్లు, విద్య, వైద్య సదుపాయాలను అభివృద్ధి చేస్తే మార్కాపురం ప్రాంతం వ్యవసాయ ఆధారిత ఆర్థిక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని తెలిపారు.

**పోలవరం నుంచి రాష్ట్రవ్యాప్త ప్రగతి వరకు :** పోలవరం, హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వంశధార, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయడం ద్వారా రాష్ట్రంలో నీటి భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సత్యకుమార్ అన్నారు. పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ మౌలిక వసతుల అభివృద్ధితో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు వాటి ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి అనుసంధానం కల్పించే విధానంతో రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతోందని పేర్కొన్నారు.

## ప్రతి నీటి బొట్టునూ స్వచ్ఛంగా అందిస్తాం

- మంచినీరు ఎక్కడా కలుషితం కాలేదు
- అంచలంచల పర్యవేక్షణ ద్వారా నీటి శుద్ధి
- నీరు కలుషితమైతే 103కి ఫిర్యాదు చేయండి
- సచివాలయ ఎమినిటీస్ ప్రతి ఇంటినీ పరీక్షించాలి
- తక్కెళ్లపాడు రిజర్వాయర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** నగర ప్రజలకు ప్రతి నీటి బొట్టునూ స్వచ్ఛంగా అందిస్తామని, ప్రజలు ఎలాంటి అపోహలు పడొద్దని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. ఆదివారం స్థానిక తక్కెళ్ళపాడు రిజర్వాయర్, నెహ్రు నగర్ తోపాటు ఇతర ఈఎల్ఎస్ పాయింట్లను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా పరిశీలించారు. గుంటూరు నగరంలో కొన్ని ప్రాంతాలలో అపరితమైన నీరు సరఫరా అవుతుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో శుద్ధీకరణ వ్యవస్థల గురించి వాటర్ సప్లై అధికారులతో మాట్లాడి ప్రతి వ్యవస్థలో మంచినీటి శుద్ధి జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. తక్కెళ్లపాడు రిజర్వాయర్ కు కృష్ణా నది నుంచి రా వాటర్ సరఫరా జరుగుతుందని, ఈ నీరు పట్టిసీమ నుంచి రావడంతో కొంత రంగు మారిందని చెప్పారు. అయితే ప్రతి రిజర్వాయర్ వద్ద క్లోరినేషన్ నుంచి ట్యాంకుల ద్వారా ఇంటింటికి సరఫరా వరకు అంచలంచల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు ప్రతి రోజూ ప్రతి పది ఇళ్లకు ఒక ఇంటికి సరఫరా అవుతున్న నీటిని పరిశీలించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు చెందాల్సిన పనిలేదని స్వచ్ఛమైన నీరు అందిస్తున్నామని చెప్పారు. క్లోరినేషన్ గాని, ట్యాంకుల శుభ్రతగానీ పక్కాగా జరుగుతుందన్నారు.

ప్రజలకు ఇంకా ఎక్కడైనా అపరిశుభ్రత నీటి సరఫరా జరుగుతుంటే వెంటనే 103కి ఫిర్యాదు చేయాలని, మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు.

## సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ )**కడప జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను నీటితో నింపి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనార్థం రావడం జరిగింది గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివారం బ్రహ్మం సాగర్ ను కడప జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి రైతులతో కలిసి పరిశీలించారు అనంతరం బ్రహ్మ సాగర్ ప్రాజెక్టు పైన ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు సాగునీరు అత్యంత కీలకమన్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పెంచి పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అదేవిధంగా జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు నిరంతరాయంగా సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని అన్నారు. రైతులు, ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు

రైతులకు సాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో నీటిని అందించాలి. సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడకుండా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించాలి. ంటలకు అవసరమైన సమయంలో నీరు అందించి రైతులకు అండగా నిలవాలి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి. వేసవితో పాటు అన్ని కాలాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలి.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగు తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి మైదుకూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షుడు అన్నపురెడ్డి నారాయణరెడ్డి, జిల్లా వాలంటరీ విభాగ అధ్యక్షుడు నల్లపురెడ్డి ప్రశాంత్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పసుపులేటి వెంకటేష్ గొడ్లవీడు పంచాయతీ అధ్యక్షుడు పుల్లలచెరువు రమేష్‌రెడ్డి గొడ్లవీడు రైతు అధ్యక్షుడు అబ్బిరెడ్డి ఎర్రంపల్లి పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరెడ్డి మండల ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వేమిరెడ్డి నరసింహారెడ్డి ఎల్లటూరు మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే విశాఖ 'మారికవలస'లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

- ఫిజిక్స్ వాలా' తో ఇంటెన్సివ్ కోచింగ్
- ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎం . గౌతమి



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని గిరిజన విద్యార్థుల్లో ఉన్న అపారమైన ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో వారు ఉత్తమ ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేసిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎం . గౌతమి తెలిపారు. ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని మారికవలస బాలుర గురుకుల పాఠశాల క్యాంపస్‌లోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఆమె సందర్శించి, క్లాస్ రూమ్ లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు జాతీయ స్థాయి అర్హత పరీక్షలైన ఐఐటి – జెఇఇ, నీట్ వంటి పోటీ పరీక్షలకు అత్యున్నత శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు . దీనిని అందరూ స్వాగతించాలన్నారు. బీసీ, సోషల్ వెల్ఫేర్ శాఖల తరహాలోనే గిరిజన సంక్షేమ శాఖకు కూడా ఈ అదనపు సీఓఈ ని మంజూరు చేసిందని తెలిపారు. పారదర్శకమైన ఆర్ ఎఫ్ పి ప్రక్రియ ద్వారా దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ అయిన 'ఫిజిక్స్ వాలా' ను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సంస్థ నిపుణులైన అధ్యాపకులతో మన పిల్లలకు ఇంటెన్సివ్ కోచింగ్ అందిస్తుందని, దీనికి సంబంధించిన తరగతులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు.

ఉత్తరాంధ్ర ఏజెన్సీ మరియు మైదాన ప్రాంత విద్యార్థులకు రవాణా, ఇతర సదుపాయాల దృష్ట్యా విశాఖపట్నం ఎడ్యుకేషనల్ హబ్ కావడం వల్ల మారికవలసను ఎంచుకోవడం జరిగిందని, ఇక్కడ మెరిట్ ఆధారంగా ఎంపిక చేసిన 300 మంది బాలురు, 300 మంది బాలికలు (మొత్తం 600 మంది) ప్లస్ వన్, మరియు ప్లస్ టు విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో ఇంటెన్సివ్ ట్రైనింగ్ అందిస్తున్నామని తెలియజేసారు.

మారికవలస స్కూల్‌లో ఇదివరకు ఉన్న పాఠశాల విద్యార్థులను పక్కనే ఉన్న గర్ల్స్ క్యాంపస్, కృష్ణాపురం, సబ్బవరం ఎస్ ఒ ఇలకు మరియు వారి స్వంత ప్రాంతాల గురుకులాలకు (వారి అభ్యర్థన మేరకు) సురక్షితంగా బస్సుల్లో, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పంపడం జరిగిందన్నారు. తల్లిదండ్రులకు ముందే అవగాహన కల్పించి, విద్యార్థులకు ఫేర్‌వెల్ ఇచ్చి ఎంతో జాగ్రత్తగా పంపించామని, రాత్రికి రాత్రే ఖాళీ చేశారనడంలో నిజం లేదని తెలియజేసారు. ఈఎంఆర్ఎస్ గురుకులాల తరహాలోనే విద్యార్థుల్లో భవిష్యత్ కార్పొరేట్ రంగానికి అనుగుణంగా ఆత్మవిశ్వాసం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పెంచేందుకు కో–ఎడ్యుకేషన్ విధానాన్ని అందిస్తున్నామని, అయితే బాలికలు, బాలురకు వేర్వేరుగా డార్మిటరీలు, క్లాస్–రూమ్‌లు, అదనపు సీసీటీవీ కెమెరాలు, ప్రత్యేక వార్డెన్లు, అదనపు సెక్యూరిటీని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. క్యాంపస్ లో ఉన్న విద్యార్థుల తో మాట్లాడారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఐఐటీ, నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి తమ కుటుంబానికి, సమాజానికి మరియు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కార్యదర్శి గౌతమి ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ అప్పల రాజు పాల్గొన్నారు.

## కొటబొమ్మాలి కొత్తమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికే రూ.4.52 కోట్లు



- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడుల కృషికి దక్కిన ఫలితం
- ప్రాకార మండపం నిర్మిస్తూ ఆలయాన్ని ముస్తాబు చేసేందుకు నిధులు మంజూరు

**కొటబొమ్మా (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీకాకుళం జిల్లా కొటబొమ్మాలి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొత్తమ్మ అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధి పనులకు రూ. 4.52 కోట్లు ఉమ్మడి నిధులు మంజూరయ్యాయి. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అలాగే కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుల ప్రత్యేక కృషి ఫలితంగానే దేవాదాయ శాఖ నుంచి ఈ స్థాయి నిధులు విడుదలయ్యాయి. ఇప్పటికే కొత్తమ్మ తల్లి ఉత్సవాలను రాష్ట్రస్థాయి పండుగలా చేయడంలో వీరి కృషి మరవలేనిది.

**రూ.5 కోట్లతో సమగ్ర ప్రణాళిక :** కొత్తమ్మ అమ్మవారి దేవాలయ ప్రాకార మండపం నిర్మాణం, ఇతర మరమ్మతులు, అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 5కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇందులో భాగంగా స్థానిక మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ కింద రూ. 48 లక్షలు డిపాజిట్ చేయగా, దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ కమిటీ మిగిలిన రూ. 4,52,00,000 లను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ కే. రామచంద్రమోహన్ అమరావతి నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

**వేగంగా టెండర్లు, నాణ్యమైన పనులు :** మంజూరైన అంచనా వివరాలకు సాంకేతిక అనుమతులు పొంది, ఈ–టెండర్ల విధానంలో పారదర్శకంగా పనులు ప్రారంభించాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాకార మండప నిర్మాణం పూర్తయితే భక్తులకు మౌలిక వసతులు మెరుగవుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ ఔదార్యం



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ రైతాంగానికి ఉపయోగపడేలా రూ. కోటి విలువగల రెండు జేసీబీలను వితరణగా అందజేశారు. మొదటిగా కాకుమాను మండలంలోని అన్ని గ్రామాల రైతుల ప్రయోజనం కోసం ఈ జేసీబీలు ఉచిత సేవలు అందజేస్తాయి. ఆయా గ్రామాల పరిధిలోగల కాలువల బాగు చేయుటకు , పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలకు, ఇతరత్రా పనులకు వీటిని వినియోగిస్తారు. తమ గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల వివరాలు తెలియజేస్తే వీటిని అక్కడకు తరలిస్తారు. అందుకు ఒక లారీని కూడా కొనుగోలు చేసి అందుబాటులో ఉంచారు. వీటిని ఆయా పనులకు వినియోగించుకోదలచిన గ్రామస్తులు ఆయిల్ పోయించుకుని ఎంత సమయమైనా వాడుకోవచ్చు. వీటి నిర్వహణ బాధ్యతలను కాలువ ప్రసాద్ కు అప్పగించారు. కొత్తగా వచ్చిన రెండు జేసీబీలకు ఆదివారం కొండపాటూరు పోలేరమ్మ దేవస్థానంలో పూజలు చేయించారు.

**కారుమంచి ప్రసాద్‌లకు కృతజ్ఞతలు :** రైతుల ప్రయోజనార్థం ఉచితంగా రెండు జేసీబీలను అందజేసిన కారుమంచి ప్రసాద్ కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, రైతు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాకుమాను ప్రాంత రైతులకు ఉపయోగపడే వివిధ పనులకు ఆయన ఈపాటికే నిధులు సమకూర్చి రైతుబాంధవుడుగా పేరు పొందారని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డ్ చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, కాకుమాను మండల టీడీపీ అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్, కాంద్రు గోపి, యర్రాకుల దానయ్య, ముత్తినేని భాస్కరరావు, టీడీ ప్రసాద్, పొన్నం శ్రీనివాసరావు, గింజుపల్లి నవీన్, తోట ఫణీంద్రకుమార్, వట్టికూటి వెంకటేశ్వర్లు, కెబీ పాలెం సర్పంచి పెద్దిరవి, మువ్వా రామచంద్రరావు, జంగా మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు



**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్):** వేమూరు నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకుల కుటుంబ సభ్యుల వివాహ వేడుకల్లో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీం–ర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు గ్రామానికి చెందిన నీటి సంఘం డీసీ అధ్యక్షుడు యర్రంశెట్టి కర్ణ శ్రీనివాసరావు కుమార్తె వివాహ రిసెప్షన్ టీఎం రావు హైస్కూల్‌లో ఘనంగా జరిగింది. అదేవిధంగా చుండూరు మండల టీడీపీ అధ్యక్షుడు, వలివేరు గ్రామానికి చెందిన తమ్మా శివారెడ్డి కుమారుడి వివాహ వేడుక తెనాలిలోని రత్న ఫార్చ్యూన్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# భట్టిప్రోలులో రూ.49.50 లక్షలతో నూతన రైతు బజార్



○ శంకుస్థాపన చేసిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

**భట్టిప్రోలు (జర్నలిస్ట్ ఫైల్):** రైతుల సంక్షేమంతో పాటు ప్రజలకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా భట్టిప్రోలు మార్కెట్ యార్డులో రూ. 49.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన రైతు బజార్‌కు వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు శంకుస్థాపన చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ, వేమూరు ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెట్ కల్పించడంతో పాటు రైతులు, వినియోగదారుల మధ్య దళారుల ప్రమేయాన్ని తగ్గించడమే రైతు బజార్ ప్రధాన ఉద్దేశమన్నారు.

రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం, ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రైతు బజార్‌లో రైతులకు నిబంధనల ప్రకారం స్టాళ్లు, షాపులు కేటాయించనున్నట్లు తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. రైతులతో పాటు డ్వాక్రా మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు కూడా నిబంధనల మేరకు స్టాళ్లు కేటాయించనున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు జాయింట్ కలెక్టర్ నిర్ణయించిన అద్దెను నెలవారీగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రైతుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం స్టాళ్లలో 40 శాతం వరకు రైతులకు కేటాయించనున్నట్లు తెలిపారు.

రైతు బజార్‌కు వచ్చే రైతులకు సిబ్బంది ద్వారా రైతు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

బహిరంగ మార్కెట్‌లో ప్రతిరోజూ కొనసాగుతున్న ధరలను పరిగణనలోకి తీసుకుని రైతు బజార్‌లో కూరగాయలు, ఆకుకూరల ధరలను సిబ్బంది నిర్ణయిస్తారని తెలిపారు. భట్టిప్రోలులో రైతు బజార్ అందుబాటులోకి వస్తే రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు ప్రజలకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకు లభిస్తాయని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నక్కా ఆనంద బాబు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషి చేయాలి




○ బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్

○ కుల వివక్ష నిర్మూలనకు అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలి

○ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** సమాజంలో దళితుల పట్ల కొనసాగుతున్న అసమానతలు, వివక్ష తొలగిపోయేలా ప్రతి దళిత కుటుంబానికి న్యాయం అందించేందుకు ఎస్సీ మోర్చా లీగల్ సెల్‌లోని న్యాయవాదులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ పిలుపునిచ్చారు. అక్రమ కేసుల్లో చిక్కుకుని సరైన న్యాయం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దళితులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించాలని సూచించారు.

విజయవాడలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా లీగల్ సెల్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నూకల మధుకర్ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా విజయవాడ బార్ కౌన్సిల్ సభ్యులు, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పాలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ పాల్గొన్నారు.

**అంబేద్కర్ ఆశయాలను ఆచరణలోకి తేవాలి**

ఈ సందర్భంగా నూకల మధుకర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన జీవితంలో ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్నప్పటికీ వాటికి వెరవకుండా తన జీవితాన్ని తాను కోరుకున్న రీతిలో మలుచుకుని దేశానికి మార్గదర్శకమైన రాజ్యాంగాన్ని అందించారని గుర్తుచేశారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకుని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. బహిరంగ వేదికలపై కుల వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న కొందరు, ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మాటలకు, చేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని సమాజంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**ప్రతి జిల్లాలో న్యాయ సహాయ వ్యవస్థ**

పనతల సురేష్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో అన్ని మోర్చాలకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ మోర్చాకు అనుబంధంగా లీగల్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

రాష్ట్రస్థాయి కన్వీనర్‌గా డాక్టర్ అశోక్‌ను నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్సీ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్లు సమావేశంలో పాల్గొన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, న్యాయపరమైన సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవాలని, న్యాయ సహాయం అందించి మెరుగైన జీవితానికి బాటలు వేయాలని కోరారు.

సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లూరి గంగాధర్, జోనల్ ఇన్‌చార్జి మేకల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సర్వశుద్ధి రాజు, పార్టీ లీగల్ సెల్ సభ్యుడు చె. ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర సేవల వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి

○ ఆపదలో ఉన్నవారికి ఉచిత వైద్య తరలింపు సేవలు




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** అత్యవసర సమయాల్లో ఆపదలో ఉన్న రోగులను వైద్య చికిత్స కోసం ఆసుపత్రులకు ఉచితంగా తరలించేందుకు ఎమర్జెన్సీ వాహనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. తెనాలి పట్టణంలో ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రీ-మెడికల్ ఎమర్జెన్సీ వాహనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆలపాటి మాట్లాడుతూ న్యాయవాది అన్నం పిన్నారావు ఆధ్వర్యంలో ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ ఆర్గనైజేషన్ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అవసరమైన వారికి ఉచిత వాహన సౌకర్యం కల్పించడం ఎంతో విలువైన సేవ అని పేర్కొన్నారు.

ప్రజలకు 24 గంటల పాటు ఉచితంగా అత్యవసర వాహన సేవలు అందుబాటులో ఉండటం సంతోషకరమని ఎమ్మెల్సీ తెలిపారు. ప్రమాదాలు, అనారోగ్య అత్యవసర పరిస్థితులు, ఇతర ఆపద సమయాల్లో ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆసుపత్రికి సకాలంలో చేరుకోవడం ఎంతో కీలకమని, ఈ వాహనం ఆ దిశగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి ప్రజలకు అందుబాటులో ఉండేలా సంస్థ నిర్వాహకులు కృషి చేయాలని ఆలపాటి సూచించారు. సమాజంలో సేవాభావంతో పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇటువంటి సేవలను అందించడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో న్యాయవాది అన్నం పిన్నారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ కుద్దూస్, అశోక్ వర్ధన, పసుపులేటి త్రిమూర్తి, దేవినేని రమాదేవి, ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ప్రతిష్టను పెంచుతున్న నిరుపేద విద్యార్థులు



**మంగళాపురం(చల్లపల్లి) (జర్నలిస్ట్ ఫైల్):** తమ ప్రతిభ పాటవాలతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల యొక్క ప్రతిష్ట పెంచుతున్నారని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షలో అర్హత సాధించి కేంద్ర ప్రభుత్వ స్కాలర్షిప్ కు ఎంపికైన మంగళాపురం జడ్పీ హైస్కూల్ కి చెందిన చోరగుడి సౌమ్యను సురేష్ బాబు అభినందించి రివార్డును అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ పాఠశాలల పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగించి వాటికి పేరు ప్రతిష్టలను ఇనుమడింప చేస్తున్న నిరుపేద విద్యార్థులు పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తారన్నారు. పోటీ పరీక్షలలో విజయం సాధించడానికి ఖరీదైన శిక్షణ, ఉన్నత కుటుంబ నేపథ్యం అవసరం లేదని సౌమ్య లాంటి విద్యార్థులు రుజువు చేస్తున్నారన్నారు. విద్యార్థులు చిన్నప్పటినుండి పోటీ పరీక్షల్లో పాల్గొని ఉన్నత విద్యా అవకాశాల కొరకు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఆర్థిక, సామాజిక కష్టాల నుండి బయటపడడానికి విద్య ఏకైక మార్గం అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా ప్రత్యేక టీచర్లను నియమించాలని సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ద

ఈ కార్యక్రమంలో నేత కొమ్ముకూరి ప్రసాదరావు, సౌమ్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సిబ్బందికి వైద్య శిబిరం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కొనాక్ డయాగ్నస్టిక్ సెంటర్ సహకారంతో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం శనివారం వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ-బ్లాక్ సెమినార్ హాల్‌లో జరిగిన శిబిరంలో సిబ్బందికి పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

శిబిరంలో మధుమేహం, టీఎస్‌హెచ్ (థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్), బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్) తదితర పరీక్షలు చేపట్టారు. కొనాక్ డయాగ్నస్టిక్ సెంటర్ ల్యాబ్ ఇన్‌చార్జ్ ఎస్.కె. ఎం.డి. నయీమ్, ల్యాబ్ టెక్నీషియన్ కె. మాధవ్ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్య బృందం సూచించింది.

కళాశాల ప్రిన్సిపాల్ డా. దోలా సంజయ్ ఎస్. మాట్లాడుతూ అధ్యాపకులు, సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమానికి కళాశాల ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విధి నిర్వహణతో పాటు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. సీతారామయ్య మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని, ముందస్తు పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు.

కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. షేక్ లాల్ జాన్ భాషా మాట్లాడుతూ "నేటి ఆరోగ్య పరిరక్షణే రేపటి ఆరోగ్యకరమైన జీవితానికి పునాది" అనే సందేశంతో శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అధ్యాపకులు, సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. దోలా సంజయ్ ఎస్., అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. సీతారామయ్య, డా. షేక్ లాల్ జాన్ భాషా, కొనాక్ డయాగ్నస్టిక్ సెంటర్ సిబ్బంది, వైద్య బృందం, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల కోసం ప్రశ్నిస్తే ... రాజకీయ అజెండా అనడం భావ్యం కాదు

○ ప్రభుత్వం ఇచ్చిన హామీలనే గుర్తు చేస్తున్నాం

○ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే మా ఏకైక అజెండా: ఏపీ జేఏసీ అమరావతి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తే దానిని రాజకీయ అజెండాగా అభివర్ణించడం సరికాదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఆదివారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును మాత్రమే కోరుతున్నామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తమ ఏకైక అజెండా అని స్పష్టం చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యలు పరిష్కరించినప్పుడు అభినందించిన విషయాన్ని గుర్తుచేశారు. 2022--23లో చలో విజయవాడ అనంతరం హామీలు అమలు కాక 92 రోజులపాటు ఉద్యమించి పలు సమస్యలను పరిష్కరించుకున్నామని తెలిపారు.

ప్రభుత్వంతో పలు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ ఫలితాలు కనిపించడం లేదని నాయకులు అన్నారు. జూలై 10, 11 తేదీల్లో మంత్రులతో చర్చలు, జూలై 22న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం, ఆగస్టు 2, 16 తేదీల్లో రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశాలు జరిగినా నిర్ణయాలపై స్పష్టత రాలేదన్నారు.

ఐదుగురు మంత్రులు, పలువురు ఐఏఎస్ అధికారులతో సుమారు ఐదు గంటలపాటు చర్చలు జరిపినప్పటికీ సుమారు 40 రోజులుగా ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. పీఆర్సీ కమిషన్ నియామకం, డీఏ, ఐఆర్, ఉద్యోగుల బకాయిలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఉద్యమ పోరాట కమిటీ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు డిమాండ్ చేశారు. ఎంత బకాయి ఉంది, ఎప్పుడు, ఏ విధంగా చెల్లిస్తారో వెల్లడించాలని కోరారు.

ఎంప్లాయిస్ హెల్త్ కార్డుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, వైద్య బిల్లులను సకాలంలో మంజూరు చేయాలని ఏపీ జేఏసీ నాయకులు కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే హక్కు ఉందని, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని బొప్పరాజు, పలిశెట్టి తెలిపారు. ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకున్నప్పుడు అభినందించడం, ఉద్యోగుల ప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు ప్రశ్నించడం తమ బాధ్యత అన్నారు. ఉద్యమం చేస్తున్నంత మాత్రాన ప్రభుత్వానికి శత్రువులం కాదని, చర్చలకు ప్రభుత్వం పిలిస్తే ఎప్పుడైనా హాజరై సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని మహిళా విభాగం నాయకులు పారే లక్ష్మి, పొన్నూరు విజయలక్ష్మి తెలిపారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం ఆగస్టు 28న రాష్ట్రస్థాయి సదస్సులో ప్రకటించిన ఉద్యమ కార్యాచరణను ఎలాంటి ఒత్తిళ్లతోనూ పక్కదారి పట్టించలేరని ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్, జేఏసీ రాష్ట్ర కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు అన్నారు. వ్యక్తిగత ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఉద్యోగుల సమస్యల పరిష్కారంపైనే దృష్టి సారిస్తామని బొప్పరాజు, పలిశెట్టి స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు, పీఆర్సీ, డీఏ, ఐఆర్, వైద్య సదుపాయాలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్. శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. కిశోర్ కుమార్, సైకం శివకుమారెడ్డి, డా. సాయిలక్ష్మి, కోటేశ్వరి, జి. అనుపమ, వై. శ్రీనివాసరావు, పి. రవిప్రసాద్, మందపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇదే పరిస్థితి ఉంటే ఉద్యోగుల ఉద్యమ బాట తప్పదు

○ ఉద్యోగుల సమస్యలపై ఇకనైనా చర్చలు జరపాలి

○ సంయమనం, బాధ్యతతో నిరీక్షిస్తూ వచ్చాం

○ సెప్టెంబర్ 5లోపు పరిష్కార మార్గం చూపకపోతే ఉద్యమ కార్యాచరణ

○ పీఆర్సీ, ఐదు డీఏలు, బకాయిల చెల్లింపులే ప్రధాన డిమాండ్లు

○ ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇకనైనా చొరవ చూపి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ కోరారు. రెండేళ్లుగా సంయమనం, బాధ్యతతో వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారం కోసం నిరీక్షిస్తున్న ఉద్యోగుల్లో సహనం నశిస్తోందని వారు పేర్కొన్నారు. పీఆర్సీ, ఐదు డీఏలు, సరెండర్ లీవ్‌లు, ఇతర బకాయిల చెల్లింపులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో జేఏసీ నేతలు మాట్లాడారు. జేఏసీ ఛైర్మన్ ఏ. విద్యాసాగర్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి ఇప్పటికే ఉద్యోగుల సమస్యలు, వారి మనోభావాలను వివరించామని, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ జేఏసీ సంఘాలతో సమావేశం నిర్వహించిందని విద్యాసాగర్ తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినప్పటికీ, పీఆర్సీ, డీఏలు, ఇతర బకాయిల విషయంలో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదన్నారు. ఈ నెల 31లోపు ప్రభుత్వం జేఏసీని చర్చలకు ఆహ్వానించాలని కోరారు.

ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య సామరస్యపూర్వక వాతావరణం ఉంటేనే రాష్ట్ర అభివృద్ధికి మరింతగా దోహదపడుతుందని విద్యాసాగర్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం సెప్టెంబర్ 5లోపు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన మార్గాలను ప్రకటించాలని కోరారు. సానుకూల స్పందన రాకపోతే సెప్టెంబర్ 5న 200కుపైగా ఉద్యోగ సంఘాలతో నిర్వహించే రాష్ట్ర జేఏసీ సమావేశంలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను నిర్ణయించి ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

పీఆర్సీ, ఐదు డీఏలు, సరెండర్ లీవ్‌లు, ఇతర బకాయిల చెల్లింపులే తమ ప్రధాన డిమాండ్లని విద్యాసాగర్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడతల వారీగానైనా చెల్లించాలని కోరారు. 2020 నుంచి సరెండర్ లీవ్‌ల చెల్లింపులు నిలిచిపోయాయని, వాటిని కూడా వెంటనే చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో పీఆర్సీ, డీఏలపై ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు కూడా పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.




ప్రభుత్వం గత రెండేళ్లలో తీసుకున్న కొన్ని సానుకూల నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని ఉద్యోగులు ఇప్పటివరకు సంయమనం పాటించారని విద్యాసాగర్ వివరించారు. ఒకటో తేదీన జీతాల చెల్లింపు, పోలీసు కేసుల ఎత్తివేత, సుమారు రూ. 22 వేల కోట్ల బకాయిల చెల్లింపు, 11 వేల మందికి సీపీఎస్ నుంచి ఓపీఎస్ అమలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం, 8 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగుల పదోన్నతులను వేగవంతం చేయడం వంటి చర్యలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అయితే ఉద్యోగుల సహనానికి కూడా పరిమితి ఉంటుందని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత ఉద్యోగులపైనే ఉందని, అందువల్ల వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యాసాగర్ అన్నారు. సుమారు 13 లక్షల మంది ఉద్యోగుల తరఫున ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్నామని తెలిపారు. ఏపీ జేఏసీ ఒక విస్తృత ఉద్యోగ వ్యవస్థ అని, ఉద్యమాలు, సమ్మెలు తమకు కొత్తకాదని పేర్కొన్నారు. ప్రస్తుతం సమస్యలు చర్చల దశలో ఉన్నందున తాము సంయమనం పాటిస్తున్నామని, చర్చలు విఫలమైన పక్షంలో ఉద్యమ కార్యాచరణ తప్పదని స్పష్టం చేశారు.

జేఏసీ సెక్రటరీ జనరల్ కె. ఎస్. ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలిచి సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. ఈ నెల 31లోపు చర్చలకు ఆహ్వానించి, సెప్టెంబర్ 5లోపు సమస్యల పరిష్కారానికి స్పష్టమైన మార్గాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తదితర అంశాల్లో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు.

లక్షలాది మంది ఉద్యోగులు జేఏసీ తదుపరి నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కారం చూపకపోతే ఉద్యమ కార్యాచరణను ప్రకటించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

సమావేశంలో ఏపీ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధి ఎ. సాంబశివరావు, ఏపీటీఎఫ్-257 ప్రతినిధి కె. బసవలింగేశ్వరరావు, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధి డి. వెంకటేశ్వర్లు, ఏపీ టీ అండ్ ఏ గెజిటెడ్ సర్వీసెస్ ప్రతినిధి పి. రాజు, ఏపీ గ్రామ/వార్డు సచివాలయ సంఘం ప్రతినిధి జానీ పాషా షేక్, ఏపీ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధి పి.వి. సాయికుమార్, మహమ్మద్ ఆరిఫ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు కె. వెంకటేశ్వరరావు తదితరులతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467